Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 215 మేడ్చల్ మల్కాజ్‌గిరి 25 ఆగస్టు 2023 శుక్రవారం పేజీలు : 4

## లోక్‌సభ ఎన్నికల్లో సోలోగానే..

లక్నో: వచ్చే ఏడాది జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయాలని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి సారథ్యంలోని బహుజన్ సమాజ్ పార్టీ నిర్ణయించింది.

ఈ ఏడాది చివర్లో పలు రాష్ట్రాలకు జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని నెలరోజుల క్రితం బీఎస్‌పీ ప్రకటించిన నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల విషయంలోనూ ఆ పార్టీ తాజాగా స్పష్టత ఇచ్చింది. "లోక్‌సభ ఎన్నికల్లో ఒంటిరిగా పోటీచేయాలంటే ప్రతి గామంలోనూ క్యాడర్‌ను పటిష్టం చేసుకోవాలి. సమాజంలోని అన్నివర్గాలనూ కలుపుకుని వెళ్లాలి. పార్టీ కార్యకర్తలకు గతంలో ఇచ్చిన అదేశాల పురోగతిని పార్టీ నేతలతో జరిపిన సమావేశంలో మాయావతి సమీక్షించారు. లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కూడా ఆవెు ఆదేశించారు" అని బీఎస్‌పీ ఒక ప్రకటనలో తెలిపింది.

# అల్లుడిపై... మామ....

# అంత బాధ్యత పెట్టారా!?



## మెదక్ నీకు అప్పజెప్తున్నా.. హరీశ్.. సీఎం మాట దేనికి సంకేతం?

మెదక్ : కీలక ప్రకటన చేశారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కమ్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 119 అసెంబ్లీ స్థానాలకు 115 స్థానాలకు అభ్యర్థుల్ని మొదటి విడతలోనే పూర్తి చేయటం ద్వారా రికార్డును క్రియేట్ వైనం తెలిసిందే. మొత్తం జాబితాలో90 శాతానికి పైనే అభ్యర్థులను ముచ్చటగా మూడోసారి ఓకే చేసిన వైనంపై గులాబీ తోటలో కొత్త తలనొప్పుల్ని తీసుకొచ్చింది. ఇందులో కొన్ని స్థానాల విషయంలో రగడ అంతకంతకూ ముదురుతోంది. ఇందులో మెదక్ అసెంబ్లీ స్థానం ఇప్పుడు సంక్లిష్టంగా మారింది. దీనికి కారణం.. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేసిన తీవ్ర వ్యాఖ్యలే. ఈ సీటును తనకు కేటాయించాలని కోరుతున్నప్పటికీ.. అలాంటి అవకాశం లేకుండా చేసిన వైనం మైనంపల్లిని కలిచివేస్తోంది. గడిచిన మూడేళ్లుగా నిర్విరామంగా తన కొడుకు శ్రమించి.. నియోజకవర్గంలో బలమైన క్యాడర్ ను సొంతం చేసుకున్న వేళ.. తమకు కాకుండా ఆరోపణలు.. విమర్శలు ఉన్న ఎమ్మెల్యే పద్మా దేవేందర్ కు ఇవ్వటాన్ని తప్పుపడుతున్నారు. ఈ క్రమంలో పద్మకు సీటు రావటంపై మంత్రి హరీశ్ మీద నిప్పులు చెరుగుతున్నారు. రూ.లక్షకోట్ల అవినీతి చేశారంటూ సంచలన ఆరోపణలు చేసిన మైనంపల్లి మాటలు హాట్ టాపిక్ గా మారాయి. తాజాగా జరిగిన మెదక్ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. గులాబీ బాస్ టికెట్లు ప్రకటించే వేళలో తిరుమలలో ఉన్న మైనంపల్లి.. జాబితాను ప్రకటించటానికి కొన్ని గంటల ముందు మంత్రి హరీశ్ మీద తీవ్ర వ్యాఖ్యలు చేయటం.. దానికి ప్రతిగా ముఖ్యమంత్రి సైతం మైనంపల్లిని పెద్దగా సీరియస్ గా తీసుకోకపోవటం తెలిసిందే. అంతేకాదు.. బయటకు వెళితే వెళతారన్నట్లుగా కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు తర్వాతి రోజు మైనంపల్లి రియాక్టు కావటం తెలిసిందే. తాను ముఖ్యమంత్రి కేసీఆర్ కు విధేయుడ్ని అంటూనే.. తన కొడుక్కి టికెట్ ఇవ్వకపోవటాన్ని ఆయన తీవ్రంగా పరిగణించారు. ఈ రోజు నియోజకవర్గానికి తిరిగి వస్తున్న వేళ.. ఆయన ఎలాంటి నిర్ణయాన్ని తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉంటే.. బుధవారం మెదక్ లో జరిగిన బహిరంగ సభలో మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యతను మంత్రి హరీశ్ కు అప్పజెప్పిన వైనం చూస్తే.. మైనంపల్లికి గట్టి సంకేతాల్ని ఇచ్చినట్లుగా అర్థమవుతుంది. ఎమ్మెల్యే పద్మ తన బిడ్డ అని.. తెలంగాణ ఉద్యమం మొదటి రోజు నుంచి తనతో ఉందన్న కేసీఆర్.. మెదక్ పట్టణాన్ని హరీశ్ చేతికి అప్పజెప్పి.. దాన్ని సిద్దిపేట తరహాలో డెవలప్ చేయాలన్నారు. పద్మను దీవించి గతానికి మించిన మెజార్టీతో గెలిపిస్తే.. ప్రజలు కోరుకున్న డిమాండ్లు మొత్తం పూర్తి చేసే బాధ్యత తనదన్న కేసీఆర్ మాటలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. మెదక్ పట్టణాన్ని బ్రహ్మాండంగా తీర్చిదిద్ది.. ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేబాధ్యత మంత్రి హరీశ్ రావుకు అప్పజెబుతున్నట్లుగా పేర్కొన్న వైనం చూస్తే.. రానున్న రోజుల్లో మైనంపల్లి తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటే సిద్ధంగా ఉండాలన్న సంకేతాన్ని ఇచ్చినట్లుగా చెప్పాలి. మరి.. మెదక్ టికెట్ విషయంపై మైనంపల్లి ఏ రీతిలో రియాక్టు అవుతారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారిందని చెప్పాలి.



## మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పట్నం మహేందర్‌రెడ్డి

హైదరాబాద్ : కేబినెట్ మంత్రిగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం రాజ్ భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మహేందర్‌రెడ్డి చేత మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు హాజరయ్యారు.

## కాంగ్రెస్‌కు భయపడిన వ్యక్తికి మంత్రి పదవా..?



వికారాబాద్ జిల్లా: కాంగ్రెస్ పార్టీకి భయపడిన వ్యక్తికి బీఆర్ఎస్‌లో మంత్రి పదవీ ఇచ్చారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సెటైర్లు వేశారు. గురువారం నాడు వికారాబాద్ జిల్లాలో పర్యటించారు. పూడూరు మండలం మన్నేగూడ జేకే ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ చేవెళ్ల "ప్రజాగర్జన" సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మీడియాతో మాట్లాడుతూ.. "ఒక్క మాదిగ బిడ్డకు కూడా మంత్రివర్గంలో అవకాశం కల్పించలేదు. మాదిగ బిడ్డలు బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటు వేయాలి. ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుంది. సుప్రీంకోర్టులో మీ తరపున వాదిస్తాం. పాలమూరు ఎత్తిపోతల పూర్తి చేయడం సీఎం కేసీఆర్‌కు ఇష్టం లేదు. కృష్ణా నది జలాలు వికారాబాద్ జిల్లాకు ఎందుకు తేలేదనీ అడిగితే ఏపీ సీఎం జగన్ అడ్డుపడుతున్నాడని కేసీఆర్ చెబుతున్నారు. మరి జగన్‌ను ప్రగతి భవన్‌కు పిలిచి భోజనం పెట్టినప్పుడు తెలియదా.? నీళ్లు జగన్‌రెడ్డి తీసుకెళ్లాడు. నిధులు మెగా కృష్ణారెడ్డికి ఇచ్చారు. నియామకాలు కేసీఆర్ ఇంట్లోకి పోయాయి. ఇందిరమ్మ రాజ్యం తెచ్చి తెలంగాణలో దళిత గిరిజనులను ఏ విధంగా అభివృద్ధి చేసుకుంటామో డిక్లరేషన్ ద్వారా వివరిస్తాం. చేవెళ్ల సెంటిమెంట్‌తో నిర్వహించే సభను అందరూ కలిసి విజయవంతం చేయాలి. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి రావల్సిన సాగునీరు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కేసీఆర్ ఒక్క చుక్క నీరు ఇవ్వలేదు. గోదావరి జలాలన్ని మావే అంటూ తమ నియోజకవర్గాలకు మళ్లించుకున్నాడు. ఆయన ఫాంహౌస్ చుట్టూ కాలువలు చేసుకొని సిరిసిల్ల, గజ్వేల్‌కే నీళ్లు ఇస్తా అంటున్నారు. ఈ ప్రాంతానికి కేసీఆర్ సీఎం కాదా....? ఈ ప్రాంతంలో ఉన్న ముదిరాజ్ బిడ్డలు ఆలోచించాలి...కేసీఆర్ ఒక్క ముదిరాజ్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదు. ముదిరాజ్ బిడ్డలు తెలంగాణ వారు కారా....వీరు తెలంగాణ ఉద్యమంలో లేరా. ముదిరాజ్ బిడ్డలు కేసీఆర్‌కు ఎందుకు ఓటు వేయాలి" అని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు ఉందా.....డబుల్ బెడ్ రూం ఇళ్లు ఉన్న ఊర్లు ఏమైనా ఉన్నయా ప్రజలు ఆలోచించాలి అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. "వికారాబాద్‌లో ఈసారి కాంగ్రెస్ జెండా ఎగురేస్తాం. ఈనెల 26వ తేదీన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేవెళ్లలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల సభను మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ జహీరాబాద్ నుంచి పోటీ చేస్తారని రేవంత్‌రెడ్డి ముందే ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి ప్రసాద్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 26 న జరిగే చేవెళ్ల సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే వస్తారు. సభలో రాష్ట్ర రాజకీయాలు, దళిత గిరిజన అభ్యున్నతి కోసం డిక్లరేషన్ ప్రకటిస్తాం" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



## కోకాపేటలోనే కాదు అక్కడ కూడా

# భూముల ధరల మోత!

## శంకరపల్లి మండలంలో గజం అక్షరాల లక్ష!!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిలో ప్లాట్లను వేలం వేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కోకాపేటలో మొదటి విడతలో వేలం వేసిన 65 ఎకరాలతో ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరింది. ఏకంగా రూ. 2 వేల కోట్లకుపైనే ప్రభుత్వం దండుకుంది. కోకాపేటలో ఎకరం గరిష్టంగా రూ.100 కోట్లకు, కనిష్టంగా రూ.45 కోట్లు పలికిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరిన్ని ఆదాయ వనరులపై దృష్టి సారించిన ప్రభుత్వం ఇప్పుడు శంకరపల్లి మండలంలో మోకిలలో ప్లాట్లను అమ్ముతోంది. ఇక్కడ హెచ్‌ఎండీఏ లేఅవుట్ ని అభివృద్ధి చేసింది. దాదాపు 165 ఎకరాల విస్తీర్ణంలో 1,321 ప్లాట్లలతో కూడిన భారీ రెసిడెన్షియల్ లేఅవుట్ ను సిద్ధం చేసింది. ఆగస్టు మొదటి వారంలో జరిగిన అమ్మకంలో కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో రెండో దశలో 300 ప్లాట్లను ఆన్‌లైన్ వేలం ద్వారా ఆగస్టు 23 నుంచి 29 వరకు విక్రయించనుంది. మోకిలలో మొదటి ఫేజ్ లో మంచి డిమాండ్ వచ్చిన నేపథ్యంలో రెండో దశలో 300 ప్లాట్లకు ప్రీబిడ్ లను ఆహ్వానించింది. ఈ క్రమంలో మోకిలలో ఆగస్టు 23 బుధవారం ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో 60 ప్లాట్లను వేలం వేయగా.. గరిష్ఠంగా చదరపు గజానికి రూ.లక్ష ధర లభించింది. 361 నంబరు ప్లాటు చదరపు గజానికి రూ.లక్ష చొప్పున 375 గజాలకు రూ.3.75 కోట్లు పలకడం విశేషం. రెండు మినహా మిగతా 58 ప్లాట్లు వేలంలో అమ్ముడుపోవడం విశేషం. సరాసరి చదరపు గజం ధర రూ.63,512 చొప్పున వేలంలో అమ్ముడైంది. కనిష్ఠ ధర చదరపు గజానికి రూ.55 వేల వరకు పలికింది. మొత్తం 20,025 చదరపు గజాలకు గాను 19,275 చదరపు గజాలు అమ్ముడుపోయాయి. దీనిద్వారా హెచ్‌ఎండీఏకు రూ.122.42 కోట్ల ఆదాయం వచ్చింది. అప్‌సెట్ ధర రూ.50 కోట్లు కంటే రెండు రెట్లకు పైగా రావడంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు. కాగా హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) ఆధ్వర్యంలో ఆగస్టు మొదటి వారంలో మోకిలలో నిర్వహించిన మొదటి విడత వేలంలో ప్లాట్లు కూడా హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. 50 ప్లాట్లకు వేలం నిర్వహించగా.. చదరపు గజం గరిష్ఠంగా రూ.1.05 లక్షల వరకు ధర పలికింది. కనీస ధర రూ.72 వేలకు విక్రయించారు. ఒక్కో ప్లాట్ 300–500 చదరపు గజాల్లోపు ఉంది. కోకాపేట నియోపోలిస్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నార్సింగిలకు సమీపంలో ఉండటంతో కొనుగోలుదారులు ఎగబడ్డారు. అప్‌సెట్ ధర చదరపు గజానికి రూ.25 వేలు నిర్ణయించగా.. కొన్ని మూడు, నాలుగు రెట్లు ఎక్కువ ధరకు అమ్ముడయ్యాయి. మొత్తం 50 ప్లాట్లకు రూ.40 కోట్లు ఆశించగా.. అంతకు మూడు రెట్లు అధికంగా రూ.121.40 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది.

# సంపాదకీయం

## అమెరికా సీక్రెట్ వెపన్.. హెల్ ఫైర్ ఆర్9ఎక్స్ స్పెషల్ ఏంది?

ప్రపంచ వ్యాప్తంగా మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టుగా పేరుతో పాటు.. వందల కోట్ల రూపాయిల పారితోషికం అతడి తలకు కట్టిన అగ్రరాజ్యం.. ఎట్టకేలకు తాను అనుకున్నట్లే అతడ్ని లేపేసింది. అయితే.. ఈ సందర్భం గాఅమెరికా వాడిన ఆయుధం ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. ఎలాంటి పేలుడు చోటు చేసుకోకుండా.. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులకు ఎలాంటి హాని కలిగించకుండా.. తమ టార్గెట్ అయిన జవహారీని మట్టుపెట్టిన చాక చక్యం ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా చర్చకు తెర తీసింది. ఈ అత్యాధునిక క్షిపణిని హెల్ ఫైర్ ఆర్9ఎక్స్ గా చెబుతున్నారు. అగ్రరాజ్యం సీక్రెట్ వెపెన్ గా దీన్ని చెబుతున్నారు. ఇంతకీ ఈ అత్యాధునిక ఆయుధం కతేంటి? దాని విశేషాలేమిటి? అన్నది చూస్తే.. ఎవరినైనా టార్గెట్ చేసి.. చుట్టుపక్కల వారికి ఎలాంటి హాని కలిగించకుండా ఉండేందుకు సంధించే క్షిపణిగా దీన్ని చెబుతారు. ఈ క్షిపణికి మూలం ఏజీఎం 114 హెల్ ఫైర్. ఇది లేజర్ గైడెడ్ క్షిపణి. ఆకాశం నుంచి భూమి మీదకు దీన్ని ప్రయోగిస్తారు. ధ్వని కంటే తక్కువ వేగంతో ప్రయాణించే ఈ క్షిపణికి సంబంధించి అనేక వేరియంట్లు ఉన్నాయి. వాటిల్లో ఒకటి "హెల్ ఫైర్ ఆర్9ఎక్స్". దీని ప్రత్యేకత ఏమంటే.. పరిసరాలకు పెద్దగా నష్టం వాటిల్లకుండా చేయటం.. టార్గెట్ చేసిన వ్యక్తులను మాత్రమే ఏసేస్తుంది. ఈ క్షిపణి వ్యవస్థను ఒబామా హయాంలో డెవలప్ చేశారు. కరుడుగట్టిన ఉగ్రనాయకుల్ని ఎలాంటి సిబ్బంది అవసరం లేకుండానే ఈ క్షిపణి సాయంతో హతమారుస్తారు. ఉగ్ర నేతల్ని ఏసేసుందుకు ఈ తరహా క్షిపణులను అమెరికా ప్రయోగిస్తోంది. తమ వద్ద ఉన్న ఆయుధాల్లో కొన్నింటి గురించి చెప్పినా.. హెల్ ఫైర్ ఆర్9 ఎక్స్ ఉన్న విషయాన్ని మాత్రం అగ్రరాజ్యం రివీల్ చేయలేదు. 2017లో తొలిసారి ఈ క్షిపణి కనిపించింది. సిరియాలో అల్ ఖైదా సీనియర్ నేత అబూ అల్ ఖయిర్ అల్ మస్రి ప్రయాణిస్తున్న కారు మీదకు దీన్ని ప్రయోగించారు. ఆ సందర్భంలో ఈ క్షిపణి తీవ్రతకు కారు మీద పెద్ద రంధ్రం పడినట్లుగా చెబుతారు. దీని ప్రభావానికి అల్ మస్రీ తో పాటు కారులో ఉన్న వారంతా నుజ్జునుజ్జు అయ్యారని చెబుతారు. కానీ.. కారు ముందు భాగం.. వెనుక భాగం మాత్రం దెబ్బ తినకపోవటం చూస్తే.. ఈ అత్యాధునిక క్షిపణి.. ఎంతటి శక్తివంతమైనదో ఇట్టే చెప్పొచ్చు. అలా ప్రపంచానికి తనదగ్గర ఉన్న సరికొత్త క్షిపణి వ్యవస్థ గురించి ప్రపంచానికి తెలిసింది. ఆ తర్వాత కాలంలోనూ వీటిని వాడినా.. అవన్నీ ప్రత్యేక సందర్భాలేనని చెబుతారు. దాదాపు ఐదు అడుగులు.. 45 కేజీల బరువుతో ఉండే ఈ క్షిపణిని డ్రోన్లు.. హెలికాప్టర్లు.. విమానాలు.. హమ్వీ వాహనాలతో ప్రయోగించే వీలుంది. 500 మీటర్ల నుంచి 11 కిలోమీటర్ల రేంజ్ వరకు దీన్ని ప్రయోగించే వీలుంది. హెల్ ఫైర్ ఆర్9ఎక్స్ క్షిపణిలో వార్ హెడ్ ఏమీ ఉండదు.కానీ.. క్షిపణి ముందు భాగంలో పదునైన కత్తులు లాంటి బ్లేడ్లు ఉంటాయి. లక్ష్యం సమీపానికి వెళ్లగానే.. ఈ బేడ్లు విచ్చుకొని ఒక్కసారిగా లక్షిత వ్యక్తుల్ని టార్గెట్ చేసి.. శరీరాన్ని ఛిద్రం చేసేస్తాయి. తద్వారా తాము అనుకుంటున్న పనిని పూర్తి చేస్తాయి.

# సృజనాత్మకతకు వేదిక జిజ్ఞాస



ములుగు : జిజ్ఞాస.. విద్యాశాఖ రూపొందించిన వినూత్న కార్యక్రమం.. విద్యార్థుల్లో ఆలోచనలు రేకెత్తిస్తోంది.. మెదడుకు పదును పెడుతోంది.. అధ్యయనాలు చేయిస్తోంది.. సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తోంది. అందుకే డిగ్రీ కళాశాలలు జిజ్ఞాసను ప్రోత్సహిస్తున్నాయి. ఇందులో భాగంగా విద్యార్థులు వివిధ అంశాలపై ప్రాజెక్టులు తయారు చేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందించి వారిలో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతున్నారు. ఈ విద్యాసంవత్సరానికి జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టులకు సంబంధించి ప్రకటన వెలువడింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 15 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు 120కి పైగా ప్రాజెక్టులను తయారు చేయడంలో నిమగ్నమయ్యారు.

నేటి పోటీ ప్రపంచంలో మంచి మార్కులు సాధిస్తే సరిపోదు. వివిధ అంశాలపై లోతైన విశ్లేషణతో పాటు వ్యక్తిగత సామర్థ్యాలను పరిశీలిస్తున్నారు. అందుకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదివే వారికి జిజ్ఞాస కార్యక్రమం ఓ వరంలా మారింది. స్టడీ ప్రాజెక్టులు అందరి కంటే భిన్నంగా ఉండేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఎంచుకునే అంశంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. పది మందికి మేలు జరిగే విధంగా ఉండాలని కోరుకుంటున్నారు. ఇందుకోసం ఎంతో కసరత్తు చేస్తున్నారు. ప్రజలు ఎదుర్కొనే సమస్యలు, వివిధ విభాగాల్లో సాంకేతికను ఎలా ఉపయోగించుకోవాలి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ద్వారా ఎలాంటి ప్రయోజనాలు కలుగుతున్నాయి అనే అంశాలపై స్టడీ ప్రాజెక్టులు తయారు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**13 విభాగాలు... 16 సబ్జెక్టుల్లో.**

డిగ్రీ కోర్సులకు సంబంధించి సైన్స్, కామర్స్, సోషల్ సైన్స్, భాష శాస్త్రాలకు చెందిన 13 విభాగాల్లో 16 సబ్జెక్టుల్లో జిజ్ఞాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి కళాశాల నుంచి ఒక్కో సబ్జెక్టుకు ఐదు నుంచి ఆరుగురు విద్యార్థులు కలిసి ఒక స్టడీ ప్రాజెక్టు తయారు చేస్తారు. వారికి ఒక అధ్యాపకుడు మార్గదర్శకుడిగా వ్యవహరిస్తారు. ఈ నెల 31వ తేదీలోగా కళాశాల స్థాయిలో పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీకి పంపిస్తారు. వచ్చే నెల చివరి వారంలో రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయి. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టును విషయ నిపుణులు ఎంపిక చేసుకున్న అంశం, లక్ష్యాలు, వారు లేవనెత్తిన అంశాలతో పాటు విద్యార్థులు పీపీటీ ద్వారా ప్రజెంటేషన్ తీరును పరిగణనలోకి తీసుకొని మార్కులు కేటాయిస్తారు. తర్వాత రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు.

**ప్రథమ బహుమతికి రూ.25,000**

రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులకు రూ.25 వేలు, ద్వితీయ బహుమతి పొందిన వారికి రూ.18 వేలు , తృతీయ బహుమతి వారికి రూ. 10 వేలు నగదును అందజేస్తారు. వీటితో పాటు ఇచ్చే ధ్రువపత్రాన్ని విద్యార్థులు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తారు. అందుకే స్టడీ ప్రాజెక్టులను పోటీ పడి తయారు చేయడంతో పాటు ఎంతో సృజనాత్మకంగా ప్రజెంటేషన్ చేస్తారు.

**ఎంతో స్ఫూర్తినిచ్చింది: ప్రణిత**

నేను పింగళి కళాశాలలో బీఏ పూర్తి చేశాను. గతేడాది ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో పని ప్రదేశాల్లో మాహిళా ఉద్యోగుల సమస్యలు, సవాళ్లు అనే అంశంపై అధ్యయనం చేయడానికి హనుమకొండలోని వివిధ రెవెన్యూ కార్యాలయాలకు వెళ్లాం. మహిళా ఉద్యోగులతో మాట్లాడాము. వారు చెప్పిన అనేక అంశాలను మా ప్రాజెక్టులో పొందుపరిచాం. నాకు వ్యక్తిగతంగా చాలా విషయాలపై అవగాహన వచ్చింది. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి వచ్చింది. ఇది ఎంతో స్ఫూర్తినిచ్చింది.

**ఆత్మవిశ్వాసం పెరిగింది: పి.పావని**

ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతున్నా. మిత్రులతో కలిసి సూపర్ మార్కెట్లు, కిరాణ దుకాణాల్లో ఆహార కల్తీ ఏ విధంగా జరుగుతుందో ఆనే అంశంపై ప్రాజెక్టు తయారు చేశాం. ఇందుకోసం చాలా కసరత్తు చేశారు. కల్తీ జరిగే విధానం గురించి తెలుసుకున్నాం. ప్రజలు ఏ విధంగా నష్టపోతున్నారన్న విషయంపైనే పరిశోధనలు కొనసాగించాం. ప్రాజెక్టు ద్వారా మాకు పరిశోధన ఎలా చేయాలో తెలిసింది. ముఖ్యంగా పీపీటీ ద్వారా మా ప్రాజెక్టు గురించి తెలపడం ద్వారా నాలో ఎంతో ఆత్మవిశ్వాసం పెరిగింది.

**భవిష్యత్తుకు దోహదం: – డాక్టర్ బత్తిని చంద్రమౌళి, ప్రిన్సిపల్, పింగళి ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, హనుమకొండ**

పరిశోధనలపై ప్రత్యేక ఆసక్తిని కనబర్చేలా జిజ్ఞాస రూపొందించారు. దీని ద్వారా చాలా మంది విద్యార్థులు డిగ్రీ స్థాయిలోనే స్టడీ ప్రాజెక్టులను అత్యంత సమర్థంగా తయారు చేసే స్థాయికి ఎదుగుతారు. వారి భవిష్యత్తు చదువులకు ఎంతో ఉపయోగపడుతుంది. రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులకు ఎంతో గుర్తింపు లభిస్తుంది.

# ఏజెన్సీ పెద్దాసుపత్రిలో వైద్యుల కొరత



ములుగు : ఏజెన్సీ ప్రాంత ప్రజలకు పెద్ద దిక్కుగా ములుగు జిల్లాలో మినీ ఎంజీఎంగా పేరుగాంచిన ములుగు ఏరియా ఆసుపత్రిని డాక్టర్లు, సిబ్బంది కొరత వెంటాడుతోంది. రోజు రోజుకు రోగుల సంఖ్య పెరుగుతోంది. అందుకు అనుగుణంగా వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అందుబాటులో ఉన్నవారితో సేవలందిస్తున్నప్పటికీ సరిపోవడం లేదు. 50 పడకలు ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రూ. 8 కోట్లు వెచ్చించి నూతన భవనాన్ని నిర్మించి వంద పడకల స్థాయికి పెంచారు. సుమారు ఐదేళ్లు కావొస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో సిబ్బంది నియామకం జరగలేదు. డాక్టర్ల పోస్టులు సగానికంటే ఎక్కువగా ఖాళీగానే ఉన్నాయి. సాధారణ జబ్బులకు మాత్రమే ఆసుపత్రి ఉపయోగపడుతోంది. అత్యవసర పరిస్థితుల్లో వరంగల్, భద్రాచలం తదితర ప్రాంతాలకు పరుగులు పెట్టక తప్పడం లేదు.

**అరకొర సేవలు**

వంద పడకల ఏరియా ఆసుపత్రిలో వివిధ స్థాయిల్లో మొత్తం 66 మంది డాక్టర్లుండాలి. వీరిలో సివిల్ సర్జన్లు, డిప్యూటీ సివిల్ సర్జన్లు, సివిల్ అసిస్టెంటు సర్జన్లు ఉండాలి. కానీ అన్ని కేటగిరీలకు సంబంధించి కేవలం 27 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన 39 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. తాత్కాలిక పద్ధతిన కొన్ని పోస్టులు భర్తీ చేసి కాలం వెళ్లదీస్తున్నారు. సివిల్ సర్జన్‌లు 13 మందికి గాను ఆరుగురు, 11 మంది డిప్యూటీ సివిల్ సర్జన్‌లకు 11, సివిల్ అసిస్టెంటు సర్జన్ స్థాయిలో 42 మందికి గాను 21 మంది మాత్రమే ఉన్నారు. చాలా విభాగాలకు ప్రత్యేక వైద్యులు లేక వరంగల్ లాంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పోస్టులన్నీ భర్తీ అయితే ఎంజీఎం స్థాయిలో రోగులకు సేవలందిస్తూ ఆసుపత్రి కొనసాగే అవకాశాలున్నాయి.

నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–1, 2 పోస్టులు మొత్తం 5 ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. హెడ్ నర్సులు 10 మందికి గాను ఐదుగురు, 48 స్టాఫ్ నర్సుల పోస్టులు మంజూరు చేయగా కేవలం 11 మంది మాత్రమే ఉన్నారు. 26 ఏఎన్ఎం పోస్టులకు గాను ఆరుగురు పని చేస్తున్నారు. వీటితో పాటు మిగిలిన అన్ని విభాగాల్లో సిబ్బంది పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి.

**ప్రభుత్వానికి నివేదించాం..**

డాక్టర్ జగదీశ్వర్, సూపరింటెండెంట్, ములుగు ఏరియా ఆసుపత్రి

ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి ప్రభుత్వానికి నివేదించాం. ఉన్నతాధికారులకు కూడా ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నాం.

# మరింత పక్కాగా భూగర్భ నీటి లెక్కలు!

కొడకండ్ల : కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఏటా రెండు విడతల్లో భూగర్భ జలాల నిల్వల లెక్కలను వెల్లడించేది. ఈ లెక్కల ఆధారంగా కరవు ప్రాంతాలను గుర్తించేది. భూగర్భ జలాల నిల్వల లెక్కలను మరింత పక్కాగా సేకరించేందుకు గతేడాది జూన్ నుంచి 'జలదూత్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఆ యాప్ సాయంతో గ్రామాల వారీగా భూగర్భ జలాల లెక్కలను తేల్చడంతో పాటు వాటి ఆధారంగా భవిష్యత్తు అవసరాలకు జల సంరక్షణ పనులు చేపట్టనున్నారు.

**ఏడాదిలో రెండు విడతలు**

భూగర్భ జల మట్టం కొలతలను సేకరించేందుకు ఉపాధిహామీ సిబ్బంది తమ పరిధిలోని గ్రామాల్లో రెండు బావులను ఎంపిక చేసుకుంటారు. జియో ట్యాగింగ్ ద్వారా బావులను అనుసంధానం చేస్తారు. జూన్–సెప్టెంబరు మధ్యలో ఒకసారి, మార్చి–జూన్ మధ్యలో ఒక సారి నీటిమట్ట కొలతలను సేకరించి జలదూత్ యాప్‌లో నిక్షిప్తం చేస్తారు. కొలతలతో పాటు చిత్రాలను జత చేస్తారు. దీంతో వర్షాకాలం ముందు, తర్వాత వేసవిలో గ్రామాల వారీగా నీటి నిల్వల్లో తేడాను జాతీయ స్థాయిలో క్రోడీకరించి భూగర్భ జలాలను అంచనా వేస్తారు. కొలతల ఆధారంగా జల సంరక్షణ చర్యలు చేపట్టనున్నారు.

**628 బావుల ఎంపిక**

ఈ కార్యక్రమానికి జిల్లాలోని 281 పంచాయతీలతో పాటు 53 శివారు గ్రామాల్లో మొత్తం 628 బావులను ఎంపిక చేశారు. వర్షాకాలంలో మొదటి విడతలో 164 గ్రామాల్లోని 348 బావుల్లో నీటిమట్టం కొలతలు సేకరించి యాప్‌లో నమోదు చేశారు. ప్రక్క పక్కనున్న గ్రామాల్లోనే భూగర్భ జలాల నిల్వల్లో తేడా ఉన్నాయని ఉపాధిహామీ అధికారులు వెల్లడించారు. కొలతలు సేకరించిన 348 బావుల్లో.. కేవలం రెండు అడుగుల లోతులో నీరున్నవి 31 ఉండగా.. మూడు నుంచి ఐదడుగుల లోతున్నవి 77, ఆరు నుంచి పది అడుగుల లోతున్నవి 93, పది అడుగుల లోతులో నీటి మట్టం ఉన్న బావులు 147 నమోదైనట్లు తెలిపారు. గత ఐదేళ్ల నుంచి పంటల సాగు విస్తీర్ణాన్ని గమనిస్తే క్రమంగా పెరుగుతూ 2 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగినట్లు గుర్తించారు.

ప్రజలకు అవగాహన కల్పించాలిజి.రాంరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి గతేడాది వర్షాకాలంలో ప్రారంభమైన జలదూత్ కార్యక్రమంలో జిల్లాలో 348 బావుల్లో మాత్రమే కొలతలు సేకరించారు. ఈ ఏడాది మార్చి నుంచి రెండో విడతలో గుర్తించిన బావుల్లో కొలతలు సేకరిస్తారు. ఈ ప్రక్రియతో భూగర్భ జలాలు ఎక్కడ పడిపోయాయో గుర్తించి ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పనుల్లో భాగంగా వాటర్‌షెడ్ పనులు, రైతుల పొలాల చుట్టూ కందకాల తవ్వకం, సేద్యపు, చిన్న నీటికుంటల నిర్మాణం, జల సంరక్షణ పనులు చేపట్టే అవకాశం ఉంది. ప్రతి పంచాయతీలో కొలతలు నమోదు చేస్తున్నందున జల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

# మారిన నగర స్వరూపం.. బృహత్ ప్రణాళిక అమల్లో జాప్యం

కరీంనగర్ : రోజురోజుకు నగర జనాభా విపరీతంగా పెరుగుతోంది.. అవసరాలకు తగ్గట్లుగా శివారు ప్రాంతాల వరకు కాలనీలు విస్తరిస్తున్నాయి.. ఇళ్ల నిర్మాణం, బహుళ అంతస్తులు నిర్మిస్తుండగా.. లేఅవుట్ లేకుండా స్థలాలు కొనుగోలు చేయడం.. కనీస సౌకర్యాలు కల్పించడంలేదనే ఫిర్యాదులు ఆయా కాలనీవాసుల నుంచి వస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ లేకపోగా, ఉన్న ప్రణాళిక అమలు సక్రమంగా జరగడం లేదు.కరీంనగర్ నగర పాలక సంస్థ, కొత్తపల్లి మున్సిపాలిటీ పరిధితోపాటు శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొత్త మాస్టర్‌ప్లాన్‌పై కసరత్తు ప్రారంభించి రెండేళ్లు కావస్తోంది. ఇప్పటివరకు ప్రణాళికల అమలు కాని, పూర్తి స్థాయి సమావేశాల నిర్వహణ కాని చేయకపోవడంతో ఈ ప్రాంతానికి మాస్టర్‌ప్లాన్ ఉందా? లేదా? అనే అనుమానాలు ప్రజల నుంచి వస్తున్నాయి. కొత్త బృహత్తర ప్రణాళికను పకడ్బందీగా ఉండేలా ఓ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. మాస్టర్‌ప్లాన్ తయారీ సందర్భంగా గతేడాది నగర మేయర్ వై.సునీల్‌రావు, సుడా ఛైర్మన్ జీవీ రామకృష్ణారావు, అప్పటి కమిషనర్‌తో కలిసి కార్పొరేటర్లు, ఆయా ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి దీనిపై సలహాలు, సూచనలు తీసుకున్నారు.

**నగరానికి 1997 ప్లానే అమలు**

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో 1997 నాటి మాస్టర్‌ప్లాన్ అమల్లో ఉంది. ఇప్పటికీ దాని ఆధారంగానే అనుమతులు జారీ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 20 ఏళ్లకు ఒకసారి దీనిని తయారు చేయాల్సి ఉంటుంది. అప్పటికీ ఇప్పటికి నగర రూపురేఖలు పూర్తిగా మారాయి. గతంలో 50 డివిజన్లు ఉండగా ప్రస్తుతం సమీప గ్రామాలను కలిపి 60 డివిజన్లుగా చేశారు. సరిహద్దులు మారాయి. సుడా, నగరపాలక కలిపి భౌగోళిక సమాచార (జీఐఎస్) విధానంలో ప్రణాళిక రూపొందిస్తుండగా రెండేళ్ల నుంచి కసరత్తు జరుగుతోంది.

**ముందుగానే అభ్యంతరాల స్వీకరణ**

కొత్త మాస్టర్‌ప్లాన్ అమలుకు రెండోసారి అవగాహన సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉండగా ఏడాది నుంచి పత్తా లేకుండా పోయింది. ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రణాళిక ఏవిధంగా ఉండనుందో స్పష్టంగా వివరించాల్సి ఉంటుంది. అప్పుడు డ్రాఫ్ట ప్రకటన జారీ చేస్తారు. 30 రోజులపాటు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. వచ్చిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత తుది ఆమోదానికి నోటిఫికేషన్ జారీ చేస్తారు. నెలాఖరులోగా రెండో సమావేశం ఏర్పాటు చేస్తామని నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

**ఎక్కడైనా సరే 30 అడుగుల రోడ్డు**

కొత్త పురపాలిక చట్టం ప్రకారం కొత్తగా ఏర్పడిన కాలనీల్లో, ఇళ్ల అనుమతులు తీసుకునే సమయంలో 30ఫీట్ల రహదారి వదిలి పెట్టేలా అనుమతులు జారీ చేయాల్సి ఉంటుంది. కొత్తగా తయారు కానున్న మాస్టర్‌ప్లాన్‌లో దీనిని పరిగణనలోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఎక్కడా పాత ప్రణాళిక వినియోగించు కోవడం లేదు. 20 ఫీట్ల రోడ్డు ఉంటే సెట్‌బ్యాక్ లేకుండా రోడ్డు మీదకు వచ్చి నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. రహదారులు, డ్రైనేజీల నిర్మాణ సమయంలో ప్లాన్ ప్రకారం విస్తరణ జరగడం లేదు. వంకర, టింకరగా నిర్మించడం లేదంటే డ్రైనేజీల ప్లాన్ మార్చడం చేస్తున్నారు.

**మాస్టర్ ప్లాన్‌తో ప్రయోజనాలు**

సమష్టి అవసరాలకు పార్కులు, కూరగాయల మార్కెట్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక భవనాలు, క్రీడా ప్రాంగణాలు, తాగునీటి నిల్వ కేంద్రాలు, బస్టాండ్ల ఏర్పాటుకు స్థలం కేటాయిస్తారు.సులభంగా పట్టణ ప్రణాళిక ద్వారా అనుమతులు పొందే వీలుంది. ప్రణాళిక ప్రకారం రహదారులు, డ్రైనేజీలు, నడకదారులు నిర్మించేందుకు ముందస్తుగా నిర్ణయిస్తారు.నగరంలో ఉన్న పారిశ్రామిక ప్రాంతాలు, వ్యవసాయ భూములను నివాసిత ప్రాంతాలుగా గుర్తించవచ్చు. విలీన కాలనీల్లో క్రమపద్ధతిలో ఇళ్ల నిర్మాణం చేయడంతోపాటు విశాల రహదారులు ఏర్పాటు కానున్నాయి. పాత పంచాయతీలు, విలీన కాలనీల్లో ఉన్న పంచాయతీ వివరాలు, మ్యాపుల సమస్య తొలగి స్థిరాస్తులకు డిమాండ్ పెరుగుతోంది. చెరువులు, కుంటలు, ప్రభుత్వ ఆస్తులన్నీ నగర ప్రణాళికలో చేరుతాయి.

# ఆన్‌లైన్‌లో అనుమతి.. ఆమ్యామ్యాలతోనే పని

జగిత్యాల : 'పట్టణంలోని ఆర్ఎన్‌టీనగర్‌కు చెందిన ప్రయివేటు ఉద్యోగి సుభాష్ గత నవంబరు 7న భవన నిర్మాణ అనుమతి రెన్యూవల్ కోసం టీఎస్‌బీపాస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. రెవెన్యూ ఉద్యోగి నిర్మిత భవనాన్ని పరిశీలించి ధ్రువీకరించారు. బల్దియా ప్రణాళిక విభాగం ఉద్యోగి క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా దరఖాస్తు తిరస్కరించడంతో అనుమతి నిలిపివేశారు. ఇదేంటని బల్దియా అధికారులను నిలదీస్తే మరోమారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెండోసారి దరఖాస్తు చేస్తే రెవెన్యూ ఉద్యోగి తిరస్కరించారు. తాజాగా మూడోసారి దరఖాస్తు చేసినప్పటికీ అనుమతి కోసం నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడిందని దరఖాస్తుదారుడు వాపోయారు.'స్పెషల్‌గ్రేడ్ పురపాలిక జగిత్యాలలో భవన నిర్మాణ అనుమతి దొరకాలంటే చేతినిండా డబ్బులన్నా ఉండాలి లేదా పలుకుబడి కలిగిన నేతల ప్రమేయమైనా ఉండి తీరాల్సిందే. పైన ఉదహరించినట్లు సుభాష్‌లాంటి సగటు దరఖాస్తుదారులు ఈ రెండూ లేనట్లయితే కాళ్లరిగేలా కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే. అనుమతి రాకపోవడంతో నిర్మాణం ముందుకుసాగక.. బ్యాంకు రుణం అవసరమైనవారు ఆర్థిక అవసరాలు తీరక నానా తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం అనుమతుల్ని పారదర్శకంగా అందించేందుకు టీఎస్‌బీపాస్ ఆన్‌లైన్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. దరఖాస్తు చేసిన 21 రోజుల్లో నిబంధనల మేరకు అధికారులు అనుమతి జారీ చేయాల్సి ఉంటుంది. కానీ బల్దియా ప్రణాళిక విభాగం అంతులేని అక్రమాలకు పాల్పడుతోంది. ఏడాదిక్రితం ఏసీబీ దాడి చేసి ముగ్గుర్ని అరెస్టు చేసినా మార్పు కనిపించడంలేదు. పట్టణంలో గత జులై 1 నుంచి గత డిసెంబరు 31 వరకు మొత్తం 280 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 174 దరఖాస్తులకు అనుమతి లభించింది. మిగిలిన 126 దరఖాస్తులను వివిధ కారణాలతో అధికారులు తిస్కరించారు. అనుమతుల విషయంలో బల్దియా, రెవెన్యూ ఉద్యోగుల మధ్య సమన్వయం కొరవడింది. ఈ కారణంగా దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు.

నిబంధనల బూచి.. నిలువెల్లా దోచి...ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన వారికి నిబంధనల సాకుతో అధికారులు ఇబ్బందులపాలు చేస్తున్నారు. పాత ఇల్లు, స్థలం ఉన్నవారు నూతన నిర్మాణాకి వెళ్తే.. 1983 నుంచి ఇంటి పన్ను చెల్లించినవారికి కొత్త పురపాలక చట్టం ప్రకారం ఎల్ఆర్ఎస్ వర్తించదు. ఈ పన్ను చెల్లించనివారికి మార్కెట్ విలువలో 14 శాతం ఎల్ఆఎర్ఎస్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. చాలా మందికి ఈ విషయంపై అవగాహన లేకపోవడం, అసెస్‌మెంట్ కాపీలు దగ్గర లేకపోవడంతో అధికారులు వారికి ఎల్ఆర్ఎస్ తప్పనిసరని చెబుతూ అనుమతులు ఇవ్వకుండా వేధిస్తున్నారు. చేసేదేంలేక అధికారులను ఆశ్రయించిన దరఖాస్తుదారులతో ఎల్ఆర్ఎస్ పేరిట కొంత, అనుమతి కోసం ఓ ధర నిర్ణయించి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. అయితే అసెస్‌మెంట్ కాపీలను ప్రభుత్వం కొన్నాళ్లుగా జారీ చేయడంలేదు. కానీ అధికారులు రికార్డుల్లో పాత ఇంటికి సంబంధించిన పన్ను వసూళ్లు చూసి ఎల్ఆర్ఎస్ వర్తిస్తుందా లేదా అనే విషయం తెలిపే అవకాశం ఉన్నప్పటికీ అవినీతే ప్రధానంగా ప్రణాళికా విభాగం వ్యవహరిస్తోంది. మరోవైపు దరఖాస్తుదారుడి ఇంటి నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే బల్దియా ఉద్యోగులు దరఖాస్తును ఆన్‌లైన్‌లో తిరస్కరిస్తున్నారు. సదరు దరఖాస్తుదారుడు అనుమతి కోసం నిరీక్షించి కార్యాలయానికి వెళ్లి వాకబు చేస్తే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు.

# తాగునీటి గండం

నాగర్‌కర్నూల్ : తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి గండం తరుముకొస్తోంది. మూడు జిల్లాల్లోని మిషన్ భగీరథ పథకాలకు ముప్పు పొంచి ఉంది. పాలేరు జలాశయంలో జల లభ్యత ఆధారంగా ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు మిషన్ భగీరథ పథకాలు నిర్మించారు. ప్రస్తుతం పాలేరు జలాశయంలో నీటిమట్టం అడుగంటుతోంది. ఈ రిజర్వాయ ర్‌కు సాగర్ జలాలు విడుదల చేసి మిషన్ భగీరథ పథకాలకు నీరందేలా చూడాలని ఎస్ఈ సదాశివకుమార్ ఖమ్మంలోని జలవనరులశాఖ సీఈ శంకర్‌నాయక్‌కు లేఖ అందించారు. జిల్లాలో తాగునీటి అవసరాలు తీరేలా సాగర్ జలాలు విడుదల చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సీఈ తెలిపారు.

పాలేరు నుంచి మూడు జిల్లాలకు..

పాలేరు రిజర్వాయర్ నుంచి కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ, తిరుమలాయపాలెం, ఖమ్మం గ్రామీణం, రఘునాథపాలెం మండలాల్లోని 359 ఆవాస ప్రాంతాలు, ఖమ్మం కార్పొరేషన్‌కు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరందిస్తున్నారు. పాలేరు జలాశయం ఇన్‌టెక్ వెల్ నుంచి నీటిని తీసుకుని జీళ్లచెర్వు వద్ద శుద్ధిపరిచి ప్రధాన పైపులైన్ ద్వారా సరఫరా చేస్తున్నారు. పాలేరు రిజర్వాయర్ నుంచి మహబూబాబాద్ జిల్లాకు నీటిని అందించేందుకు తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం వద్ద నీటిశుద్ధి కేంద్రాన్ని నిర్మించారు. అక్కడి



నుంచి 1,686 ఆవాస ప్రాంతాలు, ఐదు మున్సిపాలిటీలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఈ రిజర్వాయర్ నుంచి సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు 389 ఆవాస ప్రాంతాలకు తాగునీటిని అందిస్తున్నారు. ఇన్‌టెక్ వెల్‌లో పూడిక పేరుకుపోవడంతో మోటార్లకు నీరందని పరిస్థితి ఏర్పడింది. పాలేరు, నర్సింహులగూడెం, కిష్టాపురం, జుజ్జులరావుపేట, నాయకన్‌గూడెం, ఈశ్వరమాదారం, రాజుపేట ప్రాంతాల్లోని 33 గ్రామాలకు మరో మోటారు ద్వారా తక్కువ పరిమాణంలో నీటిని సరఫరా చేస్తున్నారు.

రోజుకు 125.6 క్యూసెక్కుల నీరు అవసరం

పాలేరు రిజర్వాయర్ నుంచి మూడు జిల్లాల్లోని మిషన్ భగీరథ పథకాలకు రోజుకు 125.6 క్యూసెక్కుల నీరు అవసరం. 11 ఎంసీఎఫ్‌టీ (మిలియన్ క్యూబిక్ ఫీట్స్) జలాలు కావాలి. పాలేరులో ప్రస్తుతం ఉన్ననీరు 15 రోజులకు సరిపోతుంది. ఈ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు. శుక్రవారం నాటికి 11.8 అడుగుల వరకు నీరుంది. 11 అడుగుల కిందికి దిగితే మిషన్ భగీరథ పథకాలకు నీరందదు. మిషన్ భగీరథ అధికారులు ఆందోళన చెందుతున్నారు. నాగార్జునసాగర్ జలాశయంలో 519.4 అడుగుల నీరుంది. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేస్తే పాలేరు జలాశయానికి చేరేందుకు కనీసం మూడు రోజులు పడుతుంది. సాగర్ ఎడమ ప్రధాన కాల్వపై ఎగువ ప్రాంతంలో అత్యవసర మరమ్మతులు జరుగుతున్నాయి. నీటిని విడుదల చేయాలంటే మరమ్మతులు నిలిపేయాల్సిందే.

తాగునీటి అవసరాలు తీర్చేందుకు సాగర్ జలాలు విడుదల చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారులకు లేఖ రాశాం. సాగర్ జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలంటే ఎగువ ప్రాంతంలో కొన్నాళ్ల పాటు మరమ్మతులు నిలిపేయాలి. మరో 15 రోజులకు సరిపడా తాగునీరు మాత్రమే పాలేరు జలాశయంలో ఉంది. సాగర్ జలాల సరఫరాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. శంకర్ నాయక్, సీఈ, జలవనరుల శాఖ, ఖమ్మం

# పర్యవేక్షణ కొరవడి.. పనులు తడబడి

ఇల్లెందు : వృథాగా కిందకు ప్రవహించే వర్షపు నీటికి అడ్డుకట్ట వేయడంతో పాటు పరిసరాల్లో భూగర్భ జలాలు పెంపొందించడమే చెక్‌డ్యాంల లక్ష్యం. ఈ నేపథ్యంలో 2020-21 సంవత్సరంలో ఫేజ్-1లో భాగంగా ఉమ్మడి జిల్లాలో 77 చెక్ డ్యాంల నిర్మాణానికి నాబార్డు రూ.207.69 కోట్లు మంజూరు చేసింది. మొత్తం 14,670 ఆయకట్టుకు నీరందుతుందని అంచనా రూపొందించారు. డ్యాంల



నిర్మాణాలు పూర్తయ్యాయి కానీ, అనుబంధంగా చేపట్టాల్సిన చివరి పనులు చేపట్టకపోవడంతో ఈ సీజన్‌లోనూ వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునే అవకాశం లేకుండా పోతోంది. గుత్తేదారుల అశ్రద్ధ, అధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి కారణంగా నిలుస్తోంది. చెక్‌డ్యాంల వద్ద డౌన్‌స్ట్రీమ్ బెడ్ పిచింగ్, రివిట్‌మెంట్‌లు, గైడ్‌వాల్స్, సైడ్‌బండ్స్ నిర్మిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

రైతులకు కొత్త కష్టాలు..బెడ్ పిచింగ్‌లు నిర్మించకపోవడంతో వాగు దాటి పంట పొలాలకు వెళ్లేందుకు, సైడ్‌బండ్స్, గైడ్‌వాల్స్ నిర్మించకపోవడంతో వాగు పొంగిన సమయాల్లో సమీప పొలాలు కోతకు గురవుతున్నాయి. దీంతో ఏమి చేయాలో తోచక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరువైపులా రివిట్లు కూడా నిర్మించకపోవడంతో వాగు ఉధృతి ధాటికి ఒడ్డు కోతకు గురవుతూ సమీప పొలాల్లోకి వరద పోటెత్తుతోంది. ఉదాహరణకు టేకులపల్లి మండలం ముక్కుమడుగుపై 2020-21లో చేపట్టిన చెక్‌డ్యాం పనులు కొద్ది రోజుల క్రితం పూర్తయ్యాయి. డౌన్‌స్ట్రీమ్ బెడ్ పిచింగ్ చేయకపోవడంతో వాగు ఒడ్డుకు వెళ్లేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. నీళ్లు నిలిచి అరకలు, ఎరువులు ఒడ్డు అవతలి వైపు తీసుకెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. మూడేళ్లుగా ఇదే సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

చివరి బిల్లులు నిలిపేశాంచెక్‌డ్యాం స్ట్రక్చర్‌ల నిర్మాణాలు వందశాతం పూర్తయ్యాయి. పది చెక్‌డ్యాంలకు సంబంధించిన తుదిదశ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. చివరి బిల్లులు నిలిపివేయడంతో పాటు గుత్తేదారులకు నోటీసులు ఇచ్చాం. వాగుల్లో నీటి ప్రవాహం కారణంగా అసంపూర్తి పనులు చేపట్టే అవకాశం లేదు. వీలైన సమయాల్లో పూర్తిచేయిస్తాం. శంకర్‌నాయక్, సీఈ,జలవనరుల శాఖ

# జిల్లాకేంద్రంలో నీటి ఎద్దడి



నాగర్‌కర్నూల్ : ప్రతి ఇంటికి తాగు నీరందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మిషన్‌భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. క్షేత్రస్థాయిలో మాత్రం అనుకున్న ఫలితాలు సాధించడం లేదు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నీటి సరఫరా సరిగ్గాలేక జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాగర్‌కర్నూల్ పట్టణంలో వారం రోజులకు ఒక్కసారి మాత్రమే మిషన్‌భగీరథ నీటిని విడుదల చేస్తున్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా కాలువలకు నీళ్లు వస్తున్నా.. తాగునీటి సరఫరాకు ఎందుకు అంతరాయం కలుగుతోందని పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు. మిషన్‌భగీరథ పథకం ప్రవేశ పెట్టకంటే ముందు బోర్ల మోటర్ల ద్వారా పట్టణంలో నీటి సరఫరా జరిగేది. ప్రస్తుతం అది కూడా నిలిపేశారు. దీంతో తాగునీటికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. తపాలా కార్యాలయంలో నుంచి ఉయ్యాలవాడ వరకు ఉన్న కాలనీల్లో ఈ సమస్య అధికంగా ఉంది. ఇళ్లల్లోని బోర్లలో నీటి మట్టం తగ్గింది. ఏడు రోజులకు ఒక్కసారి నీళ్లు విడుదల చేస్తున్నారు. 150 లీటర్లకు మించి రావడం లేదని ఈశ్వర్, హౌజింగ్‌బోర్డు, ఎర్రగడ్డ కాలనీ వాసులు వాపోతున్నారు. ప్రతి రోజు పట్టణానికి 45లక్షల లీటర్ల నీటి సరఫరా కావాల్సి ఉండగా కేవలం 15 నుంచి 20లక్షల నీళ్లు మాత్రమే సరఫరా అవుతున్నాయి.

అచ్చంపేటలో.. : అచ్చంపేట పట్టణంలో కూడా నీటి సమస్య నెలకొంది. పట్టణానికి 40లక్షల లీటర్లకు గాను 30లక్షలు మాత్రమే విడుదల చేస్తున్నారు. మూడు రోజులకు ఒక్కసారి నీళ్ల వదులుతున్నారు. కొన్ని కాలనీల్లో ఇంకా పూర్తి స్థాయిలో కనెక్షన్లు ఇవ్వలేదు. పనులు నత్తనడకన సాగుతున్నాయి.

సంపు లేక ఇక్కట్లు.. : నాగర్‌కర్నూల్ పట్టణంలో నీటి నిల్వ కోసం సంపు సౌకర్యం లేదు. వచ్చిన నీటిని నేరుగా ట్యాంకుల్లోకి ఎక్కించి వదులుతున్నారు. ప్రతి పట్టణంలో సంపు నిర్మాణం జరిగినా ఇక్కడ మాత్రం స్థలం సమస్యతో నిర్మించలేదు. ఒకవేళ సంపు ఉంటే వారం రోజులకు సరిపడ నీటిని నిల్వ ఉంచుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం అమృత్ 2.0 కింద అధికారులు సంపు, పైపులైన్లు, అదనపు ట్యాంకులతో కలిపి రూ.29కోట్లకు ప్రతిపాదనలు పంపారు. ఇవి ఏర్పాటు అయితేనే తాగునీటి ఎద్దడి పూర్తిస్థాయిలో తీరుతుంది. నిధులు మంజూరయ్యే వరకు కనీసం బోరు మోటార్ల ద్వారా నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.. :

పట్టణంలో నీటి రాక తక్కువగానే ఉంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సంపు, అదనపు ట్యాంకుల ఏర్పాటుకు సంబంధించి టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది. నెల రోజుల్లో టెండర్లు పిలిచే అవకాశం ఉంది. ఇటీవల సీసీ రహదారులకు సంబంధించి తవ్వకాల వల్ల కొంత ఇబ్బంది కలిగింది. సమస్యను పరిష్కరించి పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటాం.

వినోద్, ఏఈ, మిషన్ భగిరథ, నాగర్‌కర్నూల్.

# పెరిగిన ఓటర్లు




గద్వాల : జిల్లాలో ఓటర్లు గత జనవరి ముసాయిదా కన్నా 21 వేలకుపైగా పెరిగారు. ఎన్నికల సంఘం ఉత్తర్వుల ప్రకారం స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్‌ఎస్‌ఆర్) - 2023 ప్రకారం ఆగస్టు 2న ముసాయిదా జాబితాను విడుదల చేయాల్సి ఉంది. కాగా కొత్తగా ఓటర్ల నమోదుతో పాటు, తప్పులు సరిచేయడం, చనిపోయిన వారి పేర్లను తొలగించడానికి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటిని పరిశీలించడానికి సమయం అవసరం కావడంతో షెడ్యూల్‌ను సవరించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. మొదట ప్రకటించిన విధంగా కాకుండా మారిన షెడ్యూల్ ప్రకారం ముసాయిదా జాబితాను ఆగస్టు 21న విడుదల చేశారు.

మహిళలే అధికం

జిల్లాలోని రెండు నియోజకవర్గాల పరిధిలో 4,78,951 మంది ఓటర్లున్నట్లు ఎన్నికల విభాగం అధికారులు ప్రకటించారు. ఇందులో పురుషులు 2,37,914 మంది, కాగా మహిళలు 2,41,019 మంది, ఇతరులు 18 మంది. మొత్తంగా జిల్లాలో పురుషుల కన్నా మహిళా ఓటర్లు 3,105 మంది ఎక్కువగా ఉన్నారు. గత జనవరి 5న విడుదల చేసిన ముసాయిదా జాబితా కంటే ప్రకటించిన ఓటర్ల జాబితాలో 21,850 ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సవరించిన ఓటరు జాబితా ప్రతులను సోమవారం అందజేశారు.

బూత్‌ల వారీగా పరిశీలన

సమ్మరీ రివిజన్‌లో భాగంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్‌వోలు బూత్‌ల వారీగా కొత్త ఓటరు దరఖాస్తులను పరిశీలించడంతో పాటు, చనిపోయిన వారి ఓటుహక్కును తొలగించడానికి సంబంధింత కుటుంబసభ్యులను నుంచి మరణ ధ్రువీకరణ పత్రం తీసుకుని జాబితా నుంచి తొలగించారు. ఒక కుటుంబానికి చెందిన వారు ఒకే పోలింగ్ బూత్‌లో ఓటుహక్కును వినయోగించుకునేందుకు అవకాశం కల్పించడంతో పాటు, డబుల్ ఓటర్ల వివరాలను, ఓటు హక్కు నమోదు అయిన చోట కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉన్నవారిని గుర్తించడం లాంటి పనులను పూర్తి చేశారు. కుటుంబంలో ఆరుగురు కంటే ఎక్కువగా ఓటర్లుంటే వారిని ప్రత్యేకంగా మరోసారి పరిశీలించారు. ఇలా జిల్లా వ్యాప్తంగా డబుల్ ఓటర్లుగా నమోదైన వారు 8,166 మంది, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు 1,038 మంది, చనిపోయిన వారు 11,293 మంది ఉన్నట్లు గుర్తించారు. నిబంధనల ప్రకారం వీరందరినీ ఓటరు జాబితా నుంచి తొలగించారు. కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న వారిని జాబితాలో నమోదు చేశారు.

అక్టోబరు 4న తుది జాబితా..

ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించిన తరువాత అభ్యంతరాలను స్వీకరించడానికి ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 19 వరకు గడువు విధించారు. వచ్చిన అభ్యంతరాలను సెప్టెంబరు 28 వరకు పరిశీలించాలి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఇంకా అభ్యంతరాలుంటే వాటిని కూడా పరిశీలించి తుది జాబితాకు మెరుగులు దిద్దిడానికి అక్టోబరు 1 వరకు అవకాశం ఇచ్చారు. అనంతరం సవరించిన ఓటర్ల తుది జాబితాను అక్టోబరు 4న ప్రకటిస్తారు. ఇప్పటికే ఓటర్ల జాబితా సవరణ కోసం బీఎల్‌వోలు ఇంటింటి ప్రచారంలో ఉన్నారు. సవరణ జాబితా తయారీకి గడువు పెంచడంతో వారికి మరికొంత సమయం చిక్కింది. ఇంత వరకు ఓటరు జాబితాలో పేర్లులేని వారి నమోదుకు అవకాశం వచ్చినట్లయింది. ఎన్నికల సందర్భంగా ఓటరు జాబితాపై అభ్యంతరాలు తలెత్తకూడదనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ సవరణ షెడ్యూల్‌లో మార్పులు చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు.

# ఉత్పత్తి నిలిచినా ..రవాణా తగ్గేదెలే

సత్తుపల్లి : మూడు రోజులుగా ఓ వైపు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూ బొగ్గు ఉత్పత్తి నిలిచినప్పటికీ నల్లబంగారం రవాణా మాత్రం నిరాటంకంగా సాగుతోంది. అధికారులు వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందుగానే కోల్ యార్డుల్లో పెద్దఎత్తున బొగ్గు నిల్వలు పెంచారు. ప్రస్తుతం రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే కొత్తగూడెం ఏరియాలోని సత్తుపల్లి జేవీఆర్, కిష్టారం ఓసీలతోపాటు పీవీకే-5, జీకే ఓసీల్లో దాదాపు 1.08 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి వర్షం ఆటంకంగా మారగా మట్టి వెలికితీత పనులు నిలిచిపోయాయి. ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లోని గనుల్లో బొగ్గు ఉత్పత్తికి వర్షం విఘాతం కలిగించింది. ఆయా గనుల్లోనూ బొగ్గు ఉత్పత్తితోపాటు ఓబీ పనులు నిలిచాయి. ఏడాదికి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడం కోసం చేపట్టిన ప్రణాళికలో వర్షాల వల్ల తాత్కాలికంగా ఉత్పత్తి నిలిచినా రవాణాలో మాత్రం ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు వ్యవహరిస్తున్నారు.

ఏరియాల్లో బొగ్గు వివరాలు ఇలా...

రీ కొత్తగూడెం ఏరియాలోని జేవీఆర్ ఓసీ ఏడాదికి (ఏప్రిల్ నుంచి మార్చి) 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 3.2 మి.ట. ఉత్పత్తి సాధించింది. ఈ నెలలో 7.50లక్షల టన్నులకు గాను ఇప్పటి వరకు 5.53లక్షల టన్నులు వెలికితీశారు. కిష్టారం ఓసీలో ఈ నెలలో 1.50లక్షల టన్నులకు 1.39లక్షల టన్నులు వెలికితీశారు. సీహెచ్‌పీ ద్వారా రోజూ 32వేల టన్నులు రవాణా చేస్తున్నారు. రెండు గనుల్లో వర్షం కారణంగా లక్ష టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచింది. ఇల్లెందు ఏరియా కోయగూడెం ఓసీ-2కు ఏడాదికి 30లక్షల టన్నులకు ఇప్పటి వరకు 9.7లక్షల టన్నులు ఉత్పత్తి చేశారు. ఈ నెలలో 2.13 లక్షల టన్నులకు 1.4 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి రవాణా చేస్తున్నారు. మూడు రోజుల్లో 18వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి వర్షం ఆటంకంగా మారింది. మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భ గనిలో ఏడాదికి లక్ష టన్నులకు గాను ఇప్పటి వరకు 26,055, పీకే ఓసీ-2లో 59లక్షల



టన్నులకు 21 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించారు. ఈ నెలలో పీకే ఓసీ-2లో 4.20లక్షల టన్నులకు 3.52లక్షల టన్నులు, పీకే ఓసీ-4లో 2.50లక్షల టన్నులకు 2.17లక్షల టన్నులు, మణుగూరు ఓసీలో లక్ష టన్నులకు 1,40,058 టన్నులు ఉత్పత్తి చేశారు.

నూటికి 80 శాతం రవాణా చేస్తున్నాం: ఎం.షాలేంరాజు, జీఎం, కొత్తగూడెం ఏరియాప్రతి రోజూ నూటికి 80శాతం బొగ్గును రవాణా చేస్తున్నాం. ఏరియాలో 56 మి.మీ. వర్షపాతం నమోదు కాగా మూడు రోజులుగా ఉత్పత్తి, ఓబీ పనులు నిలిచాయి. సాధారణ రోజుల్లో రోజుకు 10 రేకుల బొగ్గును తరలిస్తుండగా వర్షం కారణంగా ప్రస్తుతం రోజుకు 8 రేకుల ద్వారా 32వేల టన్నులకు తగ్గకుండా రవాణా చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. వర్షం కారణంగా ఇప్పటి వరకు 30వేల టన్నుల బొగ్గు రవాణాకు అంతరాయం కలిగింది. ముందస్తుగా బొగ్గు నిల్వలు పెట్టుకోవడం వల్లే ఎక్కడా ఇబ్బంది లేకుండా రవాణా చేయగలు గుతున్నాం.

# ఏడేళ్లుగా అదే తీరు..!

ఖమ్మం :పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 2016 అక్టోబర్ 18న ఏడు కొత్త మండలాలను ఏర్పాటుచేసింది. పాత మండల కేంద్రాలకు ఆమడదూరంలో ఉంటూ అనేక సమస్యలకు నెలవైన ప్రాంతాలను అభివృద్ధిపరచాలనే సదుద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. దాదాపు ఏడేళ్లు అవుతున్నా పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు తయారైంది. అద్దె భవనాల్లోనే అరకొర వసతుల నడుమ ప్రభుత్వ కార్యాలయాలు కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ప్రజలకు దూరభారం తగ్గించి మెరుగైన పాలన అందించాలనే ఉద్దేశంతో ఖమ్మం జిల్లాలో రఘునాథపాలెం, భద్రాద్రి జిల్లాలో ఆళ్లపల్లి, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, కరకగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలాలు కొత్తగా ఏర్పాటయ్యాయి. ఒకట్రెండు మినహా మిగతా ప్రధాన శాఖల కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కాలం వెళ్లదీస్తున్నాయి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లో మరికొన్ని తాత్కాలికంగా సేవలు అందిస్తున్నాయి. అరకొర వసతులతో విధి నిర్వహణకు అధికారులు, సిబ్బంది, సేవలు పొందే క్రమంలో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయా మండలాల వాసులు కోరుతున్నారు.

ఇదిగో సమస్యల చిట్టా.. రఘునాథపాలెంలో ఠాణా, తహసీల్ కార్యాలయ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. రెండ్రోజుల్లో వీటిని ప్రారంభించనున్నారు. వ్యవసాయశాఖకు కొత్త భవనం మంజూరు కాలేదు. ఆళ్లపల్లిలో పశు వైద్యశాల భవనంలో తహసీల్ కార్యాలయం కొనసాగుతోంది. కొమ్ముగూడెం అంగన్‌వాడీ భవనంలో సెర్ప్ కార్యాలయం కొలువుదీరింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నా పూర్తిస్థాయిలో సేవలందటం లేదు. విద్యాశాఖ కార్యాలయాన్ని నిర్మించినా ప్రారంభానికి నోచుకోలేదు. కేజీబీవీ భవన నిర్మాణం పూర్తి కాలేదు. ఎంపీడీఓ, సెర్ప్, వ్యవసాయశాఖకు కొత్త భవనాలు మంజూరు కాలేదు. లక్ష్మీదేవిపల్లిలో అద్దె భవనంలో తహసీల్ కార్యాలయం కొలువుదీరింది. ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీఓ కార్యాలయం కొనసాగుతోంది. రామచంద్ర కళాశాల భవనంలో ఠాణా సేవలు అందుతున్నాయి. ఠాణా కొత్త భవన నిర్మాణం తుది దశకు చేరింది. విద్యాశాఖకు కొత్త భవనం మంజూరు కాలేదు. చుంచుపల్లిలో సింగరేణి భవనంలో తహసీల్ కార్యాలయం, జడ్పీ భవనంలో ఎంపీడీఓ కార్యాలయం కొనసాగుతున్నాయి. ఠాణా భవన నిర్మాణం పూర్తికాలేదు. సుజాతనగర్ మండలంలో తహసీల్, ఎంపీడీఓ కార్యాలయాలు ప్రభుత్వ పాఠశాల భవనంలోనే కొనసాగుతున్నాయి. ఠాణా భవన నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. సెర్ప్, విద్య, వ్యవసాయ శాఖకు కొత్త భవనాలు మంజూరు కాలేదు. కరకగూడెంలో శిథిలావస్థకు చేరిన పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తహసీల్ కార్యాలయం కొనసాగుతోంది. ఎంపీడీఓ, వ్యవసాయశాఖ, సెర్ప్ కార్యాలయాలకు కొత్త భవనాలు మంజూరు కాలేదు. అన్నపురెడ్డిపల్లిలో ఠాణా, తహసీల్, ఎంపీడీఓ కార్యాలయాలు సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ఆవరణలోని క్వార్టర్స్‌లో కొనసాగుతున్నాయి.

# నైపుణ్య వికాసం.. ఉపాధికి ఊతం

ఖమ్మం : నేటి పోటీ ప్రపంచంలో పోరాడటానికి అవసరమైన నైపుణ్యం లేకుండానే విద్యార్థులు బయటకు వచ్చి కష్టపడుతున్నారు. డిగ్రీ పట్టాలు చేతపట్టుకొని ఉపాధి అవకాశాల కోసం దిక్కులు చూస్తున్నారు. నైపుణ్యాల మెలకువలు లేక ఉద్యోగ వేటలో చతికిలబడుతున్నారు. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులు కూడా ఉద్యోగ పోటీ పరీక్ష ఎదుర్కొనే సత్తా లేక నిరాశకు గురవుతున్నారు.అత్యుత్తమ శిక్షణ, భవితకు నిచ్చెన... ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఎంబీఏ, ఫార్మసీ అన్ని రంగాల్లో అభ్యసించే విద్యార్థులకు అతి తక్కువ రుసుముతో అత్యున్నత ప్రమాణాలున్న శిక్షణ అందిస్తున్నారు. ప్రస్తుతం పరిశ్రమల అవసరాలు ఎలా ఉన్నాయి, ఉద్యోగుల నుంచి యాజమాన్యాలు ఎలాంటి నైపుణ్యాలు ఆశిస్తున్నాయనే అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, ఆప్టిట్యూడ్, రీజనింగ్‌తో పాటు జావా, పైథాన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎంఎల్, డాటా సైన్స్, బ్లాక్‌చైన్ లాంటి ఆధునిక సాంకేతిక అంశాల శిక్షణతో పాటు ఆయా కంపెనీల భాగస్వామ్యంతో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తున్నారు.

గ్రామీణ విద్యార్థుల ప్రతిభకు సాన... గ్రామీణ విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించేలా ఈ కోర్సుల్లో ప్రతిభకు సానపడుతున్నారు. ప్రత్యేక కార్యశాలలు నిర్వహించి నిపుణుల ద్వారా శిక్షణ అందిస్తున్నారు. స్థానిక కళాశాలల్లో బోధకులతో పాటు ప్రత్యేకంగా టాస్క్ బృందం సభ్యులు కళాశాలలకు వచ్చి బోధిస్తున్నారు.

ఆలోచనలకు సాంకేతికత జోడింపు... ఉద్యోగాల చుట్టూ విద్యార్థుల ఆలోచనలు తిరగకుండా వినూత్నమైన మార్గాలను ఎంచుకుని విజయం సాధించే దిశగా చేయూత ఇస్తున్నారు. పరిశ్రమలు నెలకొల్పడంలో మెలకువలు, అవసరాలపై శిక్షణ ఇస్తున్నారు. ఆలోచనలకు సాంకేతికత జోడించి అవకాశాలు ఎలా సృష్టించాలనే ఆలోచనలను నేర్పిస్తున్నారు.

కొరవడుతున్న ఆసక్తి... విద్యార్థుల భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దే నైపుణ్య శిక్షణపై పలువురు ఆసక్తి చూపటం లేదు. వివిధ కారణాలతో ఇంజినీరింగ్, డిగ్రీ చదువుకునే విద్యార్థులు ముందుకు రావడం లేదు. శిక్షణ పొందేందుకు విద్యార్థులు కొంత రుసుము చెల్లించేందుకూ వెనుకాడుతున్నారు. కొన్ని కళాశాలలు కూడా నమోదు చేసుకోవడం లేదు.కళాశాలలు నమోదు/రెన్యూవల్ చేసుకునేందుకు తుది గడువు: జులై 15 బీ విద్యార్థులు నమోదు చేసుకునేందుకు తుది గడువు: ఆగస్టు 30 వారధిగా నిలుస్తున్న 'టాస్క్'... కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను చేర్పించడం తప్ప వారికి సరైన ఉపాధి మార్గాలు చూపడం లేదు. కళాశాల విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య అవకాశాలు కోల్పోతున్న యువతకు తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన 'టాస్క్'(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్) వారధిగా నిలుస్తోంది. నైపుణ్యం, విజ్ఞానం పెంపొందించి ఉద్యోగ అవకాశాలు కల్పించటమే లక్ష్యంగా రూపకల్పన చేసిన ఈ సంస్థ నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఒక వైపు చదువు, మరో వైపు జీవితంలో అవసరమైన నైపుణ్యాలను టాస్క్ పదును పెడుతో ంది. 2023-24 విద్యా సంవత్సరానికి గానూ విద్యార్థుల నమోదు కోసం నోటిఫికేషన్ విడుదల చేశారు. గత ఏడాది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 40 కళాశాలలు టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోగా సుమారు 3,500 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. బహుళజాతి సంస్థల భాగస్వామ్యం...తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం చేపట్టిన 'టాస్క్'లో బహుళజాతి సంస్థలను భాగస్వాములను చేసింది. నైపుణ్యాలున్న అభ్యర్థులను కోరుకుంటున్న పరిశ్రమలకు టాస్క్ వేదికగా పని చేస్తోంది. ఈ సంస్థలో నమోదు చేసుకున్న విద్యార్థులకు దిగ్గజ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. టాస్క్ ఐటీతో పాటు పరిశ్రమలతో ఒప్పందం కుదుర్చుకుంది.

## స్థానిక సమస్యల పరిష్కారమెన్నడో?

గోదావరిఖని : గోదావరిఖనిలోని రమేశ్‌నగర్, తిలక్‌నగర్‌లో పశువుల సంచారంతో తాము అనేక ఇక్కట్లు పడుతున్నామని స్థానికులు అంటున్నారు. ప్రధాన రహదారిపై పశువుల సంచారం ప్రమాదకరంగా మారింది. తిలక్‌నగర్ కూడలిలో అభివృద్ధి పనులు చేపడుతుండటంతో రహదారి ఇరుగ్గా మారింది. రోడ్డుపైనే పశువులు సేద తీరుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పోట్లాడుకుంటున్న పశువులు అటుగా వెళ్తున్నవారివైపు దూసుకు వస్తుండటంతో భయాందోళనలు నెలకొంటున్నాయి. పశువుల దాడిలో ఇటీవల ఓ మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. తెల్లారిందంటే చాలు కోతులు ఇళ్లల్లోకి వస్తున్నాయి. వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తే ఎదురుదాడికి దిగుతున్నాయి. గుంపులు, గుంపులుగా తిరిగే కుక్కలు కాలనీల్లో భయాందోళనలను సృష్టిస్తున్నాయి. రాత్రి వేళల్లో విధుల్లోకి వెళ్లేందుకు కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనాలను వెంబడిస్తుండటంతో వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పందుల సంచారం యథేచ్ఛగా సాగుతుంది. రమేశ్‌నగర్‌లో ప్రధాన మురుగు కాలువ శిథిలమవుతోంది. మరమ్మతుల కోసం ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం చేకూరడం లేదని స్థానికులు అంటున్నారు. రమేశ్‌నగర్ కూడలి నుంచి తిలక్‌నగర్ వైపునకు వెళ్లే రోడ్డులోని మార్గబిలం పైకప్పులు కుంగి ప్రమాదకరంగా మారాయి. తిలక్‌నగర్ కూడలి నుంచి పరశురాంనగర్‌కు వెళ్లే రోడ్డు, రమేశ్‌నగర్



కూడలి నుంచి లాల్‌బహదూర్‌నగర్‌కు వెళ్లే రోడ్డులో అనేక చోట్ల తాగునీటి పైపులైన్ లీకేజీతో తాగునీరు రోడ్డెక్కి పారుతోంది. ఆయా ప్రాంతాల్లోని కుళాయిల్లో నీరు సన్నని ధారగా వస్తోంది.

పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానం

తిలక్‌నగర్, రమేశ్‌నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. దోమల బెడద తీవ్రంగా ఉన్నప్పటికీ ఫాగింగ్ చేయడం లేదు. ఉపరితల మురుగు కాలువలలో సిల్టు తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పందులు, దోమల బెడద తీవ్రంగా ఉంది. పాలకవర్గం, అధికారులు స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

పీక అరుణ్‌కుమార్, రమేశ్‌నగర్

ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి

వయోవృద్ధుల మానసిక, శారీరక ఉల్లాసం కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలి. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత కోసం మినీ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి. ప్రధాన మురుగు కాలువ మరమ్మతునకు చర్యలు తీసుకోవాలి. కోతులు, కుక్కల బెడద నివారించాల్సిందిగా అనేక మార్లు మొరపెట్టుకుంటున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. వెంటనే ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. ఎండీ ముస్తాఫా, 44వ డివిజన్ కార్పొరేటర్

## ఇళ్లిచ్చారు.. వసతులు మరిచారు!

గోదావరిఖని : ఆర్భాటంగా ప్రారంభించిన రెండు పడక గదుల ఇళ్ల సముదాయంలో లబ్ధిదారులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. సారంగాపూర్ మండలంలోని పోతారం శివారులోని గణేష్‌పల్లెలో 20 మంది లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి రెండు నెలల కిందట అందించారు. పూర్తి స్థాయిలో వసతులు కల్పించి లబ్ధిదారులకు అందించాల్సి ఉండగా అరకొరగా పనులు పూర్తి చేసి పంపిణీచేశారు. మంచినీటి వసతి లేకపోవడంతో పక్కనే ఓ గుంతలో నిలువ ఉన్న నీటిని తీసుకుని అవసరాలకు వినియోగిస్తున్నారు. తాగేందుకు రోడ్డు పక్కన మిషన్ భగీరథ నల్లా నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అది కూడా రోజు రాకపోవడంతో దూరంగా ఉన్న బోరుబావి వద్దకు వెళ్లాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. విద్యుత్తు సౌకర్యం కల్పించకపోవడంతో కొంత మంది నేరుగా సమీపంలో ఉన్న విద్యుత్తు స్తంభం నుంచి తీగలు తగిలించుకుని వాడుకుంటున్నారు. మరి కొంత మంది చీకట్లో ఉంటుండగా చుట్టూ పొలాలు ఉండడంతో రాత్రివేళలో విషపురుగులు వస్తున్నాయని వాపోతున్నారు. కాలువల నిర్మాణం పూర్తి కాకపోవడంతో రోడ్డుపై నుంచి మురుగు నీరు పారుతుండగా, విద్యుత్తు లేకపోవడంతో దోమలతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారుల నిర్మాణం లేకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు వరద రావడమే కాకుండా కొద్ది రోజుల పాటు ఊట నీరు ఇళ్ల ముందు నుంచే పారుతున్నాయని, బురద మమయై అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. పూర్తి స్థాయిలో వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రూ. 25 లక్షలతో ప్రతిపాదనలు

రెండు పడక గదుల ఇళ్లలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు రూ. 25 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే విద్యుత్తు, మంచినీటి సదుపాయం, రహదారుల నిర్మాణాలతోపాటు పూర్తి స్థాయిలో వసతులు కల్పించనున్నాం. ప్రస్తుతం నివాసముంటున్న లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

చక్రునాయక్, డీఈఈభయం గుప్పిట్లోనే..

వసతులు కల్పించకుండానే ప్రారంభించి ఇళ్లలో ఉండమన్నారు. విద్యుత్తు సౌకర్యం కల్పించకపోవడంతో రాత్రి వేళలో చీకట్లో ఉండాల్సి వస్తోంది. చుట్టూ పొలాలు ఉండడంతో విష పురుగుల భయం గుప్పిట్లో నివసిస్తున్నాం. ఇంటి ముందు మురుగు నిలవడంతో దోమలు పెరిగి రోగాల బారినపడుతున్నాం.

నర్సవ్వ, గణేష్‌పల్లె

నీటి సమస్యఇంటింటికీ నీటి వసతి కల్పించక పోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇళ్ల నిర్మాణ సమయంలో గుత్తేదారు ఓ గుంత తవ్వి వదిలేయగా అందులో నిలిచిన నీటిని వాడుకుంటున్నాం. రోడ్డు పక్కన భగీరథ నల్లా ఉండడంతో అందరం అక్కడి నుంచి తెచ్చుకుంటున్నాం. పూర్తిస్థాయిలో వసతులు కల్పించకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది.దేవక్క, మహిళ, గణేష్‌పల్లె

# జీసీసీ అవకతవకలపై గురి..!



భద్రాచలం : భద్రాచలం గిరిజన సహకార సంస్థ పరిధిలో అధికారుల బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఈ ప్రక్రియ నాటికి ఓ కొలిక్కి వచ్చింది. ఈ నేపథ్యంలోనే జీసీసీ బ్రాంచి మేనేజర్‌పై సస్పెన్షన్ వేటుపడటం సంచలంగా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భద్రాచలం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, దమ్మపేటలో జీసీసీకి శాఖలున్నాయి. గతేడాది కొన్నిచోట్ల అక్రమాలు చోటుచేసుకున్నాయి. అశ్వారావుపేట మండలంలోని గోదాములో ముష్టిగింజల గోల్‌మాల్‌పై సిబ్బందిపై అప్పట్లో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. పాల్వంచ బ్రాంచి పరిధిలోని ములకలపల్లి పెట్రోల్ బంకు లెక్కల్లోనూ భారీగా తేడా వచ్చింది. ఇది రూ. 50 లక్షలు ఉంటుందని, కాదు రూ. కోటి వరకు తేడా ఉందని ఇంకొందరు ఆరోపిస్తున్నారు. గిరిజన సంక్షేమశాఖకు ఫిర్యాదులు వెల్లువెత్తటంతో ఆసమయంలో పాల్వంచ జీసీసీ బ్రాంచి మేనేజర్‌గా వ్యవహరించిన వీరభద్రస్వామిని రెండ్రోజుల కిందట సస్పెండ్ చేసినట్లు డీఎం విజయ్‌కుమార్ తెలిపారు. గతంలో చోటుచేసుకున్న ఘటనల దృష్ట్యా ఈతరహా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇందులో పాత్రధారులను గుర్తించి రికవరీ చేయించే వీలుంది.

తనిఖీ నివేదిక సిద్ధం

గిరిజన సంక్షేమశాఖలోని విద్యావిభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఏటీడీఓలు, ఐటీడీఏ ఎస్‌ఓ, మన్యం వ్యవసాయశాఖ అధికారి, ఫిషరీస్ అధికారికి ఐదు బ్రాంచిల తనిఖీ బాధ్యతను పీఓ ప్రతీక్‌జైన్ అప్పగించారు. ఐదుగురు బృందంగా ఏర్పడి బ్రాంచి కార్యాలయాల్లో గతేడాది లావాదేవీల దస్త్రాలను పరిశీలించారు. క్రయవిక్రయాల్లో పారదర్శకత పాటించారా లేదా అన్నది గమనించి ఓ అంచనాకు వచ్చారు. నిత్యావసర సరకులు, అటవీ ఉత్పత్తుల సేకరణ, పెట్రోల్ బంకుల నిర్వహణ, గ్యాస్ విక్రయ లావాదేవీలపై దృష్టి సారించిన బృందం సమగ్ర నివేదికను రూపొందించింది. ఇది త్వరలోనే పీఓ వద్దకు చేరనుంది.

లక్ష్యాలపై దృష్టి..రెండేళ్ల క్రితం జీసీసీకి రూ. 100కోట్ల లక్ష్యం ఉండేది. గతేడాది రూ. 163 కోట్లకు పెంచగా రూ. 135 కోట్లు సాధించారు. 2023-24లో రూ. 220 కోట్ల లక్ష్యాన్ని ఎంచుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 550 కోట్ల టర్నోవర్ సాధించాల్సి ఉండగా, భద్రాచలం జీసీసీ పరిధిలో పెద్దమొత్తాన్ని ప్రతిపాదించటం విశేషం. క్షేత్రస్థాయిలో ఇందుకు అనువైన పరిస్థితి ఉందా? లేదా? అన్నదీ తనిఖీ బృందం పరిశీలించినట్లు తెలుస్తోంది. పైకి చెప్పనప్పటికీ 2022-23లో కొన్నిచోట్ల భారీగానే అవకతవకలు జరిగినట్లు గుర్తించారని, ఇదే క్రమంలో ఇంకొన్ని విచారణలూ కొనసాగే అవకాశముందని సమాచారం.

# సుప్రీంతీర్పుతో పుంజుకునేనా?




ఖమ్మం : ప్రాథమిక పాఠశాలల టీచర్ పోస్టులకు బీఎడ్(బీఈడీ) అభ్యర్థులు అర్హులు కాదని సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. ఈనెల 14న దీనిపై తీర్పు వెలువరించింది. వారి నుంచి ప్రాథమిక స్థాయి విద్యార్థులకు మెరుగైన బోధనను ఆశించలేమని పేర్కొంది. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయ పోస్టులకు బీఎడ్ అభ్యర్థులూ అర్హులేనని ప్రకటిస్తూ నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ) 2018లో నోటిఫికేషన్ ఇచ్చింది. దాన్ని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చింది. తాజాగా దేశ సర్వోన్నత న్యాయస్థానం తీసుకున్న నిర్ణయం వల్ల ప్రభుత్వ, ప్రైవేటు విద్యా, శిక్షణ(డీఎడ్) కళాశాలల్లో ప్రవేశాలు పుంజుకునే అవకాశం ఉందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

14 కళాశాలల్లో మిగిలింది రెండే...

1990-91వ సంవత్సరంలో డీఎడ్ రెండేళ్ల కోర్సు ప్రారంభమైంది. అంతకు ముందు టీటీసీ ఏడాది కోర్సు ఉండేది. అప్పట్లో ఈ కోర్సులకు విపరీతమైన డిమాండ్ ఉండేది. వీటిలో సీటు దొరకడమే కష్టంగా ఉండేది. 2014 వరకు కూడా తరచూ డీఎస్సీలు ఉండటంతో చాలామంది ఈ కోర్సు చేసేందుకు ఆసక్తి చూపారు. సుమారు పదేళ్ల నుంచి డీఎస్సీలు లేకపోవటంతో డీఎడ్ చేసిన అభ్యర్థులు ఖాళీగా ఉంటున్నారు. కొంతమంది ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల టీచర్ పోస్టులకు డీఎడ్‌తో పాటు బీఎడ్ అభ్యర్థులు సైతం పోటీ పడుతుండటంతో క్రమేణా కోర్సుకు ఆదరణ తగ్గుతోంది. రానురాను ప్రవేశాలు తగ్గిపోతున్నాయి. రాష్ట్రంలో డైట్ కళాశాలలు విద్యార్థులు లేక వెలవెల బోతున్నాయి. ప్రవేశాలు తగ్గుతుండటంతో ప్రైవేటు డీఎడ్ కళాశాలలు సైతం తమ అఫిలియేషన్లను ఉపసంహరించుకున్నాయి. ఐదేళ్ల కిందట ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 14 డీఎడ్ కళాశాలలు ఉండగా ప్రస్తుతం వాటిలో కేవలం 2 మాత్రమే మిగలడం గమనార్హం. ఆ కళాశాలల్లోనూ ప్రవేశాలు అంతంతమాత్రమే.

సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు నేపథ్యంలో డీఎడ్ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ప్రాథమిక పాఠశాలల టీచర్ పోస్టులకు డీఎడ్ అభ్యర్థులు అర్హులు కాదని చెప్పిన నేపథ్యంలో ఈ పోస్టులకు భవిష్యత్తులో పోటీ తక్కువగా ఉండటంతో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో చేరుతారు. త్వరలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటిస్తున్నందున ఈ కోర్సుకు తగిన ప్రాధాన్యం లభించనుంది. సామినేని సత్యనారాయణ, ప్రిన్సిపల్, ప్రభుత్వ డైట్ కళాశాల, ఖమ్మం

# కాన్పు అంటే కోతలే...



ఖమ్మం : సాధారణ కాన్పులకే ప్రాధాన్యమంటూ ఓ వైపు వైద్యారోగ్య శాఖ పదే పదే సమీక్షలు నిర్వహిస్తోంది. సర్కారీ దవాఖానాల్లో ప్రసవం చేయించుకునే వారికి, వైద్య సిబ్బందికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు వర్తింపజేస్తోంది. కానీ, లక్ష్యం మేర సాధారణ కాన్పులు నమోదవడం లేదనే చెప్పాలి. గత ఆర్నెల్లలో ఉభయ జిల్లాల్లో నమోదైన గణాంకాలు విశ్లేషిస్తే ఇదే విశదమవుతుంది. గర్భిణుల ప్రసవ వేదనకు 'కడుపు కోత(సీ-సెక్షన్)'ల బాధలు తోడవుతున్నాయి. ఒక్కోసారి సులభమైన కాన్పునకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేసే ప్రయత్నాలు వైద్య సిబ్బందికి తలనొప్పులు తెచ్చిపెట్టేలా ఉండటం గమనించాల్సిన విషయం. దీనికి తోడు సిబ్బంది కొరత, అసౌకర్యాల వెత వేధిస్తోంది. ప్రైవేటుకు వెళ్తే సిజేరియనే..కడుపులోని బిడ్డ బయటికు రావాలంటే ప్రైవేటు ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయడమే శరణ్యంగా మారింది. ఈ దవాఖానాల్లో 'సీ-సెక్షన్ల'ను తగ్గించేందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కార్యాచరణ అంటూ ఏమీ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వసతులున్నాయని అధికారులు చెబుతున్నా.. సేవల్లో జాప్యం, కొందరు వైద్య సిబ్బంది నిర్లక్ష్య భయంతో 'ప్రైవేటు' గడప తొక్కుతున్నారు. గర్భిణులు, వారి కుటుంబీకుల్లో ఈ భయాన్ని పారదోలి, సురక్షిత కాన్పులపై భరోసాను కల్పించేందుకు చేపడుతున్న చర్యలు పెద్దగా ఫలితాలివ్వడం లేదనే వాదన వినిపిస్తోంది.

అవగాహన కల్పించడమే ముఖ్యం

మూఢనమ్మకాలు, పుట్టిన రోజు సెంటిమెంట్లు, నొప్పుల భయం వంటి సున్నిత అంశాలపై సరైన అవగాహన కల్పించకపోవడం శస్త్రచికిత్సలు పెరిగేందుకు ముఖ్య కారణాలుగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన సిజేరియన్లు మూడో వంతు ప్రైవేటు ఆసుపత్రుల్లోనే నమోదయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కేవలం ఒకవంతు మంది మాత్రమే సాధారణ కాన్పులతో సురక్షిత స్థితిలో ఉంటున్నారు. ఈ పరిస్థితి మారేలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు వ్యాయామం, యోగా, ఇతర ఆరోగ్య సంరక్షణ సూచనలు పాటించేలా అవగాహన పెంపొందించాలి. కేసీఆర్ న్యూట్రిషియన్ కిట్లు సద్వినియోగం చేసుకునేలా చూడాలి. సిజేరియన్ల అనంతర దుష్ప్రభావాలు భరించే కంటే, కొద్దిసేపు పురిటి నొప్పులు భరించి సాధారణ కాన్పు చేయించుకోవడం ఎంతో మంచిదని తెలియజెప్పాలి. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, పథకాలపై అవగాహన కల్పించాలి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, వైద్యులకు సాధారణ ప్రసవాలకు సంబంధిం గత ఏడు నెలల్లో రూ. 4.72 లక్షల పారితోషికం అందించడం విశేషం. ఉభయ జిల్లాల్లోనూ సుఖ ప్రసవాలకు ప్రాధాన్యమిచ్చేలా మరింత ప్రోత్సహించాలి.

## వామ్మో కలుషిత నీరు.. తాగేదెలా?

మునుగోడు :వర్షాకాలంలో తాగునీటితోనే వ్యాధులు సోకే అవకాశాలుంటాయి. ఇలాంటి సమయంలో నగర ప్రజలకు స్వచ్ఛమైన నీరు సరఫరా చేయాల్సిన బాధ్యత మహా నగర పాలక సంస్థదే. ఇంజినీర్లు, క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగుల నిర్లక్ష్యంతో కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో పలు కాలనీలకు కంపు కొడుతున్న కలుషిత నీరు సరఫరా అవుతోంది. స్థానిక ప్రజల ఫిర్యాదులను బల్దియా ఇంజినీర్లు తేలిగ్గా తీసుకుంటున్నారనే విమర్శలున్నాయి. సోమవారం హనుమకొండ వడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్ జోన్ పరిధిలోని కాజీపేట దర్గా, తారా గార్డెన్ వెనుక ప్రగతినగర్ కాలనీలకు కుళాయిల ద్వారా నురగ, బురద నీళ్లు వచ్చాయి. వీటిని చూసి ప్రజలు పరేషానయ్యారు. స్టీల్ బిందెలు, బకెట్లలో పట్టి చూస్తే నురగతో కనిపించగా, సంప్‌లో పరిశీలిస్తే బురద నీళ్లు కనిపించాయి. హనుమకొండ ప్రాంతం కొత్తూరుజెండా, కుమార్‌పల్లి కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. వరంగల్ ప్రాంతంలో శ్రీనివాస కాలనీ, దేశాయిపేట రోడ్ గణేష్‌నగర్,



ఎల్లమ్మబజారు ప్రాంతాల్లో నల్లాల ద్వారా రంగుమారిన తాగునీళ్లు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

లీకేజీలతోనే..: కలుషితమైన నీటి సరఫరాకు లీకేజీలే కారణమంటున్నారు. తవ్వి వదిలేసిన నీటి గుంతలు, మురుగు కాలువల్లో పడేసిన మిషన్ భగీరథ పైపులైన్లతో తాగునీళ్లు కలుషితమవుతున్నాయని తెలిసింది. కాజీపేట దర్గా, ప్రగతినగర్‌లో రెండు, మూడు చోట్ల లీకేజీలున్నాయంటున్నారు. వరంగల్ శ్రీనివాస కాలనీ నుంచి ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రికెళ్లే పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. ఐదారు నెలలుగా నల్లాల ద్వారా కలుషితమైన నీళ్లు వస్తున్నాయి. ఉర్సు బొడ్రాయి, కరీమాబాద్, దేశాయిపేట గణేశ్‌నగర్, ఒయాసిస్ స్కూల్ ముందు, ఎల్బీనగర్ వద్ద లీకేజీలతో తాగు నీళ్లు బురదమయంగా మారుతున్నాయి.పరిశీలించి చర్యలు తీసుకుంటాం- సంతోష్‌బాబు, డీఈ గ్రేటర్ వరంగల్ కాజీపేట దర్గా, ప్రగతినగర్ కాలనీల్లో తాగునీటి కలుషితంపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తాం. ఎక్కడైనా లీకేజీలుంటే నల్లాల ద్వారా తాగునీళ్లు కలుషితమవుతాయి. కాలనీల్లో పర్యటించి తగిన చర్యలు తీసుకుంటాం.

## ఇక పాఠాలు సులువుగా..!

మునుగోడు : ఆధునిక సాంకేతికతను విద్యాశాఖ అందిపుచ్చుకుంటోంది. ఫలితంగా సాంకేతిక పరంగా బోధన కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పాఠ్య పుస్తకాలపై క్యూ ఆర్ కోడ్ ముద్రణ వేసి పంపిణీ చేస్తున్నారు. పాఠ్య పుస్తకాల పైనే కాకుండా ప్రతి పాఠ్యాంశంపై సైతం క్యూ ఆర్ కోడ్ ముద్రణ పొందుపరుస్తున్నారు. ఈ విధానం ఎప్పటి నుంచో అమలవుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో అవగాహన లేక చాలా పాఠశాలలో క్యూ ఆర్ కోడ్ అమలు తీరు అంతంత మాత్రంగానే ఉన్నట్లుగా తెలుస్తోంది. దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తే ఇంట్లో ఉన్న సమయాల్లోనూ చరవాణి ద్వారా పాఠాలు వినేందుకు అవకాశం ఉంటుంది.

విద్యార్థులకు ప్రయోజనం...

తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు అర్థం చేసుకోలేకపోయిన విద్యార్థులకు క్యూ ఆర్ కోడ్ విధానం ప్రయోజనకరంగా ఉంటుంది. చరవాణిలో ప్లేస్టోర్ ద్వారా దీక్ష యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలి. డౌన్లోడ్ చేసిన తర్వాత ఆ యాప్‌ను ఓపెన్ చేసి పాఠ్యాంశంపై ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసినట్లయితే వీడియోతో పాటు ఆడియో ద్వారా ఆ పాఠ్యాంశం స్పష్టంగా అర్థమయ్యే రీతిలో వస్తుంది. దీంతో అర్థమయ్యే వరకు నేర్చుకునే వెసులుబాటు ఉంటుంది. పుస్తకాలు లేని విద్యార్థులకు తోటి స్నేహితుల పుస్తకాల ద్వారా క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి నేర్చుకునే వీలుంటుంది. అంతేకాకుండా కొన్ని పాఠశాలలో ఇద్దరూ ఉపాధ్యాయులు ఉన్నచోట సంబంధిత తరగతికి బోధించే ఉపాధ్యాయులు అందుబాటులో లేకున్నప్పటికీ క్యూ ఆర్ కోడ్ విధానంతో చరవాణి ద్వారా విద్యార్థులు సొంతంగా పాఠాలు నేర్చుకునే అవకాశం ఉంటుంది.

అవగాహన పెంచాలి..

జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలపై క్యూ ఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసి అంతర్జాలంలో పాఠ్యాంశాలు చదివేలా చర్యలు తీసుకుంది. ఇంత పకడ్బందీగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నప్పటికీ క్యూ ఆర్ కోడ్ విధానంపై విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తే బాగుంటుంది. దీనిపై ఉపాధ్యాయులకు సరైన శిక్షణ సైతం ఇస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

సాధన చేస్తున్న:శ్రీవాణి, పదో తరగతి విద్యార్థిని, పాఠశాల, మునుగోడు దీక్ష యాప్ ద్వారా క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కావాల్సిన పాఠ్యాంశాన్ని వినేందుకు దోహదపడుతుంది. ఉపాధ్యాయులు పాఠశాలలో బోర్డుపై చెప్పే పాఠాలను వింటున్నప్పటికీ మరోసారి ఇంటికి వచ్చి చరవాణి ద్వారా నేర్చుకోవడం వల్ల సులభతరంగా అర్థమవుతున్నాయి. ఫలితంగా పాఠాలు సాధన చేసేందుకు వీలుంటుంది.

అభ్యసనా సామర్థ్యం పెరుగుతుంది

యాదగిరి, ప్రధానోపాధ్యాయుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మునుగోడుదీక్ష యాప్‌తో పాటు పాఠ్య పుస్తకాలలో ఉన్న క్యూ ఆర్ కోడ్ విధానంపై విద్యార్థులు పూర్తిగా అవగాహన పెంచుకోవాలి. దీనివల్ల ప్రతి విద్యార్థికి అభ్యసన సామర్థ్యం పెరుగుతుంది. వెనుకబడిన విద్యార్థులు క్యూ ఆర్ కోడ్ ద్వారా అర్థమయ్యే వరకు నేర్చుకునే వీలుంది. విద్యార్థికి అభ్యసన సామర్థ్యం కలిగి ఉంటే పై తరగతి పాఠ్యాంశాలను కూడా నేర్చుకునేందుకు దోహదపడుతుంది.

# ఆకట్టుకునేలా అంగన్‌వాడీలు

వీర్నపల్లి : జిల్లాలోని అంగన్‌వాడీల్లో విడతల వారీగా సమస్యలు పరిష్కరించి వసతుల కల్పనకు అధికారులు కృషి చేస్తున్నారు. చిన్నారులను ఆకట్టుకునేలా భవనాలను తీర్చిదిద్దుతున్నారు. మోడల్ అంగన్‌వాడీల పనులు చివరి దశకు చేరుకోగా మరో వారంలో ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో వేములవాడ, సిరిసిల్ల ఐసీడీఎస్ పరిధిలో 537 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 31 వేలకుపైగా చిన్నారులు, 5 వేల మంది గర్భిణులకు సేవలందుతున్నాయి. చాలా కేంద్రాల్లో సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. అద్దె గదులు, అరకొర వసతుల నడుమ కేంద్రాలకు పంపించాలంటే తల్లిదండ్రులు కొంత అనాసక్తి కనబర్చేవారు. విడతల వారీగా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ తీసుకుంటున్నారు. ప్రస్తుతం 13 మండలాల పరిధిలోని కేంద్రాలను మోడల్ అంగన్‌వాడీలుగా అభివృద్ధి చేశారు. పనులు పూర్తికాగా మౌలిక వసతుల కల్పన అనంతరం ప్రారంభించనున్నారు. రెండవ విడతలో 10 కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారీ చేస్తున్నారు.

ఒక్కో కేంద్రానికి రూ.2.27 లక్షలు



జిల్లాలోని అడవిపదిర, ఎదురుగట్ల, తెట్టెకుంట, వట్టిమల్ల, ఎన్గల్, రుద్రంగి, నేరెళ్ల, గొల్లపల్లి, నారాయణపూర్, నామాపూర్, నర్మాల, రగుడులో కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారు. ఒక్కో కేంద్రానికి రూ. 2.27 లక్షలను సమకూర్చారు. వీటితో భవనానికి రంగులతోపాటు ఆకట్టుకునేలా చిత్రాలను వేశారు. మరుగుదొడ్లు, ప్రహరీ, నీటి వసతి, విద్యుత్తు సదుపాయం, టెలివిజన్, ఆట వస్తువులు, కుర్చీలు, బోధన సామగ్రిని సమకూర్చనున్నారు. మిగులు నిధులున్న చోట ఇతర కేంద్రాలకు సర్దుబాటు చేస్తారు. టెండర్ దక్కించుకున్న గుత్తేదారు జాప్యం చేయడంతో కేంద్రాల ప్రారంభం కొంత ఆలస్యమయింది. మొదటి గుత్తేదారుకు టెండర్‌ను రద్దు చేసి మరొకరికి పనులు అప్పగించారు. మరో వారంలో పనులు పూర్తి చేసి కేంద్రాలను ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

వార్మ రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు- లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమాధికారి జిల్లాలోని 13 కేంద్రాలను మోడల్ అంగన్‌వాడీలుగా తీర్చిదిద్దుతున్నాం. గోడలకు ఆకర్షణీయంగా రంగులు వేయించాం. కళాకారులతో ఆకట్టుకునేలా చిత్రాలు గీయించాం. మొదటి గుత్తేదారు సామగ్రి పంపిణీ చేయడంలో జాప్యం చేయడంతో టెండర్ రద్దు చేసి మరొకరికి అప్పగించాం. పనులు తుది దశకు చేరుకున్నాయి. వారంలోపు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభిస్తాం.

# అక్రమ తరలింపు.. మళ్లీ అదే తంతు

మోతె : వేల కోట్లతో చేపట్టిన రహదారి విస్తరణ పనుల్లో ఉప గుత్తేదారులు నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వానికి, ఆయా గ్రామాల ఖజానాకు రావాల్సిన ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. సూర్యాపేట-ఖమ్మం రహదారి నాలుగేళ్లక్రితం 365 బీబీ జాతీయ రహదారిగా రూపాంతరం చెంది నాలుగు వరుసల మార్గంగా విస్తరణకు నోచుకుంది. మూడేళ్లక్రితం రూ.2,054 కోట్ల అంచనా వ్యయంతో 58 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ దక్కించుకొని మరో ఉపగుత్తేదారు సంస్థకు అప్పగించింది. ఈ సంస్థ రహదారి విస్తరణకు అవసరమైన మట్టి పనులను భాగాలుగా చేసి మరికొంతమంది ఉపగుత్తేదారులకు కట్టబెట్టింది. వీరంతా గ్రామాల్లోని చెరువులు, ప్రభుత్వ పరిధిలో ఉన్న గుట్టలు, రైతులకు చెందిన వ్యవసాయ భూముల్లో పడి మైనింగ్, రెవెన్యూతో పాటు ఇతర శాఖల నుంచి అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టి తవ్వి తరలించుకున్నారు. ఇది గత విస్తరణ పనుల్లో జరిగిన తంతు. తాజాగా సూర్యాపేట నుంచి ఖమ్మం వరకు రెండు జిల్లాల్లో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర పెండింగ్ పనులను ఇటీవల మొదలుపెట్టారు.

పెండింగ్ పనుల్లోనూ అలాగే..

ఈ రహదారిపై ప్రస్తుతం జిల్లాలోని మోతె మండలం రాఘవాపురం ఎక్స్‌రోడ్డు గ్రామ పరిధిలో రెండు కిలోమీటర్లమేర పెండింగ్ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ అండర్‌పాస్ వంతెనతో పాటు చుట్టూ కుంట చెరువులో పిల్లర్లతో కూడిన వంతెన నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ పనులకు లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి అవసరమైంది. ఉపగుత్తేదారు సంస్థ నుంచి మట్టి పనులు దక్కించుకున్న ఉప ఉపగుత్తేదార్లు తిరిగి అక్రమ మట్టి దందాకు తెరలేపారు. మోతె, రాఘవాపురం, సిరికొండ అటు నడిగూడెం, మునగాల మండలాల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతుల పొలాల నుంచి అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్నారు. తక్కువ ఖర్చుతో రూ.లక్షల విలువైన మట్టిని కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు.

తీసుకోని అనుమతులు..

రోడ్లకు అవసరమైన మట్టికోసం ముందస్తుగా గుర్తించిన ప్రభుత్వ భూములు లేదా ఇతరత్రా ప్రైవేటు భూముల్లో తవ్వకాలకు మైనింగ్ శాఖకు దరఖాస్తు చేసుకోవాలి. సదరు భూముల నుంచి మట్టి తీసేందుకు ఉన్న అవకాశాలను ఇతరత్రా నష్టాలను క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు పంచనామా చేసి నిరభ్యంతర నివేదిక అందజేయాలి. అనంతరం అక్కడ ఎన్ని లక్షల క్యూబిక్ మీటర్లమేర మట్టి లభ్యత ఉందో అంచనా వేసి ఒక్కో క్యూబిక్ మీటరుకు రూ.35 సీనరేజీ రూపంలో మైనింగ్ శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ అంతా పూర్తయి నిరభ్యంతర పత్రం వస్తేనే భూముల నుంచి మట్టి రవాణా చేసుకోవడానికి వీలుంటుంది. ఇలా చేస్తే ఏ గ్రామ పరిధిలో మట్టి రవాణా జరుగుతుందో సదరు గ్రామాభివృద్ధికి మైనింగ్‌శాఖ నుంచి సీనరేజీ సొమ్ములో నిర్ణీత శాతం నిధులు చేరతాయి. రైతుల భూముల నుంచి మట్టి తరలిస్తున్న ఉపగుత్తేదార్లకు ఒక్కో టిప్పర్‌కు ప్రధాన గుత్తేదారు సంస్థ రూ.6వేల నుంచి రూ.8వేల దాకా చెల్లిస్తున్నట్లు సమాచారం. సుమారు 40 టన్నులకు పైగా బరువుతో 20 యూనిట్లకు పైగా మట్టి తరలించే భారీ టిప్పర్ల ధాటికి గ్రామాలకు వెళ్లే అంతర్గత రోడ్లు సైతం పాడవుతున్నాయి.

విచారణ జరిపి చర్యలు చేపడతాం-బీవీ రమణ, మైనింగ్ శాఖ ఏడీ, సూర్యాపేట

జాతీయ రహదారికి మట్టికోసం ఇటీవల ఆయా గ్రామాల పరిధిలో ఎవరూ అనుమతులు పొందలేదు. అనుమతులు పొందకుండా రైతుల భూముల నుంచైనా రోడ్డు నిర్మాణానికి మట్టి తరలించడానికి వీలులేదు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులతో కలిసి అక్రమ మట్టి తవ్వకాలపై విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు చేపడతాం.

# ఒక్కటే దిక్కు.. ప్రాణాలెలా దక్కు!



ములుగు : అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే.. మంటలను వెంటనే ఆర్పకపోతే అంతా బూడిదవుతోంది. కొన్ని సార్లు ప్రాణ నష్టం కూడా వాటిల్లుతోంది.. సికింద్రాబాద్‌లోని నల్లగుట్ట ప్రాంతంలో గత ఓ మాల్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది కొన్ని గంటల పాటు శ్రమించినా మంటలు అదుపులోకి రాలేకపోయాయి. పొగలు కమ్ముకోవడంతో చుట్టుపక్క భవనాలు, ఇళ్లలోని జనాలు ఖాళీ చేసి పరుగులు తీశారు. ఈ సంఘటన తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఈ నేపథ్యంలో మన జిల్లాలో అగ్నిమాపక శాఖ పరిస్థితి ఏమిటి..? అనుకోని ప్రమాదం సంభవిస్తే సన్నద్ధత ఏ మేరకు ఉందనే సందేహం నెలకొంది.

జిల్లాలోని కాటారంలో గత ఐదు నెలల క్రితం ఓ వస్త్ర దుకాణంలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రూ.కోటి వరకు ఆస్తి నష్టం వాటిల్లింది.రెండు నెలల క్రితం కాటారం మండలంలోని మేడిపల్లి వద్ద పత్తి లారీ అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనలో రూ.17 లక్షల ఆస్తి నష్టం సంభవించింది.

జిల్లాలో సరిపడా కేంద్రాలు లేకపోవడం, సిబ్బంది కొరత వంటి సమస్యలు పీడిస్తున్నాయి. జిల్లాలోని భూపాలపల్లి, చెల్పూర్, కాటారం వంటి ప్రాంతాల్లో వ్యాపార, వాణిజ్య సముదాయాలు, బహుళ అంతస్థులు వెలుస్తున్నాయి. అగ్నిమాపక చట్టం ప్రకారం కొంతమంది అనుమతులు తీసుకోకుండానే నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే భారీ మూల్యమే చెల్లించుకోవాల్సిన పరిస్థితి. బహుళ అంతస్థుల భవనాల్లో సగం వరకూ అగ్నిమాపక అనుమతులు లేనట్లు తెలుస్తోంది. గతంలో అనుమతులు తీసుకున్న వారు కూడా రెన్యువల్ చేయించుకోవడం లేదు. కొత్తగా అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకోపోవడంతో నిబంధనల మేరకు నిర్మాణాలు ఉండడం లేదని అడిగేందుకు అగ్నిమాపక అధికారుల వద్ద ఎలాంటి అధికారాలు లేకుండా పోయాయి. భవన యజమానులకు అగ్నిమాపక చట్టంలో లొసుగులు అవకాశంగా మారాయి. నివాస సముదాయాలు, వ్యాపార వాణిజ్య సముదాయాలకు ఎత్తు మీటర్లు బట్టి అనుమతులు తీసుకోవాలనే నిబంధన ఉంది. భవన నిర్మాణం సమయంలో ఎత్తు తక్కువగా చూపించి అనధికారికంగా ఎక్కువ అంతస్తులు నిర్మిస్తున్నారు. వీటిపై మున్సిపల్, గ్రామ పంచాయతీలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రానుంది ఎండాకాలం

కొద్ది నెలల్లో ఎండా కాలం మొదలవనుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతుంటే అనుకోకుండా తరచూ అగ్ని ప్రమాదాలు సంభవించనున్నాయి. గతేడాది జిల్లాలో దాదాపు 35కి పైగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. రెండు మినహా మిగతావి చిన్నవి కావడంతో ప్రాణ నష్టం జరగలేదు. తాజాగా సికింద్రాబాద్‌లోని ఓ మాల్‌లో జరిగిన ఘటన నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఆసుపత్రులు, విద్యా సంస్థలు, హోటళ్లు, ఇతర భవనాలకు అధికారులు సూచనలు చేయాల్సి ఉంది.

51 కి.మీ పరిధి..51 కి.మీ పరిధి..51 కి.మీ పరిధి..

జిల్లాలో ఒకే ఒక్క అగ్నిమాపక కేంద్రం ఉంది. జిల్లా మొత్తానికి ఇదే దిక్కు.. ఇది భూపాలపల్లి పట్టణంలో ఉంటుంది. ఇక్కడి నుంచి జిల్లా చివరి ప్రదేశం 51 కిలో మీటర్లు వరకు ఉంటుంది. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతానికి శకటం వెళ్లే సరికి అంటుకున్నవి బుగ్గే అవుతాయి. అగ్ని మాపక కేంద్రాలను మరిన్ని పెంచాల్సిన అవసరం ఉంది. రెండు, మూడు మండలాలకు కలిపి ఒకటైనా ఏర్పాటు చేస్తే ప్రమాదాల నుంచి భయటపడే అవకాశం ఉంటుంది. కేటీపీపీ విద్యుత్తు కేంద్రంలో ఒక అగ్నిమాపక శకటం ఉంది. అత్యవసరమైతే దగ్గర్లోని ప్రాంతాలకు వెళ్లి సేవలు అందిస్తోంది. ఉన్న ఒక్క కేంద్రంలోనూ సిబ్బంది కొరత నెలకొంది. సొంత భవనం లేకపోవడంతో మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో ఉంటుంది. ఇటీవల 5వ గని దగ్గర్లో 1.18 ఎకరాల స్థలం కేటాయించినా.. భవన నిర్మాణ పనులకు మోక్షం లభించడం లేదు. శకటంలో నీటిని నింపుకొనేందుకు మున్సిపల్ బోరును వినియోగించుకుంటున్నారు. ప్రత్యేకంగా నీటి సౌకర్యం లేకపోయింది. సిబ్బంది ఉండేందుకు భవనం లేకపోవడంతో కార్యాలయంలోనే ఓ చిన్న గదిని ఉపయోగించుకుంటున్నారు. వసతుల లేమితో ఇబ్బంది పడుతున్నారు. 16 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం 8 మంది మాత్రమే ఉన్నారు.

చిట్యాల, కాటారంలో ఏర్పాటు చేస్తాం..గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే

జిల్లా కేంద్రంలో అగ్ని మాపక కేంద్రానికి భవనం కోసం భూమిని కేటాయించాం. నిధులు మంజూరుకాగానే నిర్మాణపు పనులు మొదలవుతాయి. సిబ్బంది కొరత తీర్చుతాం. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.. చిట్యాల, కాటారంలో కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం.

# ఈ 'శ్రమ' అంతంత మాత్రమే..



ములుగు : అసంఘటిత రంగంలో ఎక్కువ మంది పని చేస్తుంటారు. నిత్యం పనికి వెళ్తేనే వారికి పూట గడిచేది. ఇలాంటి అసంఘటిత కార్మికులందరికీ అండగా ఉండేందుకు, సంక్షేమ పథకాలు సక్రమంగా అందేందుకు, సంక్షోభ సమయాల్లో వారికి సాయం అందేలా కేంద్రం 2021 ఆగస్టు 26న ఈ శ్రమ్ పోర్టల్ తీసుకొచ్చింది. ఇందులో వివరాలు నమోదు చేసుకుంటే కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ ద్వారా డిజిటల్ ఈ శ్రమ్ కార్డులు అందజేస్తారు.

ఇవీ ప్రయోజనాలు..

ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న తర్వాత అనుకోని పరిస్థితుల్లో ఇంటి పెద్దను కోల్పోతే రూ.2 లక్షల జీవిత బీమా సౌకర్యాన్ని కేంద్రం కల్పిస్తుంది. ఈ కార్డు ఉంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందే అవకాశం ఉంది. ప్రమాదంలో గాయపడినా, అంగ వైకల్యం చెందినా రూ.లక్ష వరకు ఆర్థిక సహాయం అందజేస్తుంది.

వీరంతా దరఖాస్తు చేసుకోవచ్చు...

పరిశ్రమల్లో పని చేసే కార్మికులు, రోజు వారీ కూలీలు, వీధి వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులు, తక్కువ వేతనాలు అనగా రూ.15 వేల లోపు ఉన్న ఉద్యోగులు, పీఎఫ్, ఈఎస్ఐ, ఆదాయపు పన్ను చెల్లించని వారు, రేషన్‌కార్డు దారులు ఇలా 18 నుంచి 59 ఏళ్ల లోపు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ శ్రమ్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో గానీ, చరవాణి ద్వారా గానీ, కామన్ సర్వీస్ సెంటర్, మీ సేవ కేంద్రాల ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవాలి. ఈ కార్డు పొందాలంటే రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంకు పాస్ బుక్, చరవాణి నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

మరో నెల రోజుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అర్హులందరికీ కార్డులు అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో కార్మిక శాఖ అధికారులు వివిధ కార్యక్రమాల్లో భాగంగా ఈ శ్రమ్ కార్డులు పొందాలని అసంఘటిత కార్మికులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సి ఉంది. అర్హులైన ప్రతీ ఒక్కరికి కార్డు అందేలా చూడాలి. ఇదీ పరిస్థితి..అవగాహన లేకపోవడంతో చాలా మంది కార్మికులు ఈ కార్డులను పొందలేకపోయారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 12,51,035 మంది అసంఘటిత కార్మికులు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 5,74,709 మంది మాత్రమే ఈ శ్రమ్ కార్డు పొంది ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేవలం 46 శాతం మందే వీటిని పొందారు.

అర్హులందరికీ అవగాహన కల్పిస్తున్నాంకోల ప్రసాద్, కార్మికశాఖ సహాయ కమిషనర్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అర్హత ఉన్న అసంఘటిత కార్మికులందరికీ ఈ శ్రమ్ కార్డులు అందే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి అర్హులతో ఈ శ్రమ్ కార్డులకు రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు.

తప్పనిసరిగా తీసుకోవాలికుసుమ శ్యాంసుందర్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిఉమ్మడి జిల్లా వ్యా ప్తంగా వివిధ రంగాల్లో పని చేసే అసంఘటిత కార్మికులు, కూలీలు ఈ శ్రమ్ కార్డును తప్పనిసరిగా పొందాలి. ఈ కార్డు పొందడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి.

# యాదాద్రీశా.. అవి దారికొచ్చేదెప్పుడో

యాదగిరిగుట్ట : యాదాద్రి పుణ్యక్షేత్రాభివృద్ధిలో కొండపైకి వచ్చి, పోయే మార్గాల విస్తరణ, ఫ్లైఓవర్ల నిర్మాణం పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. ఏడాది దాటినా పనులు పూర్తికాకపోవడంతో భక్తులు, స్థానికులు కొండెక్కి దిగేందుకు తిప్పలు పడుతున్నారు. రవాణా వనరులున్న ఏ ప్రాంతాలైనా అభివృద్ధికి బాటలు వేస్తాయన్నది నిజం. రాష్ట్రానికి వన్నె తెచ్చే పుణ్యక్షేత్రమైన యాదాద్రిని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా రూపొందించాలన్న సీఎం కేసీఆర్ లక్ష్యంలో భాగంగా రవాణా వనరుల కల్పనకు 'యాడా' సదరు పనులపై దృష్టిసారించింది.

ఒకటి పూర్తి కాగా.. రెండోది..కొండెక్కి దిగే కనుమ దారులకు రెండు దిక్కుల్లో రూ.69 కోట్ల వ్యయంతో రెండేళ్ల కిందట చేపట్టిన పై వంతెనల్లో ఉత్తర దిశలోని పైవంతెన నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చింది. గతేడాది ఆగస్టులో కూలిన కొండపైకి వెళ్లే పాత కనుమదారిని విస్తరించి, రిటైనింగ్ వాల్‌తో చేపట్టిన మరమ్మతులు సైతం కొన'సాగు'తున్నాయి. సదరు పనులు జరుగుతున్న దశలో సిమెంట్ కాంక్రీటు వ్యాన్ బోల్తాపడి ఓ కార్మికుడు దుర్మరణం పాలైన విషయం తెలిసిందే. పక్కా మరమ్మతులతో 7 మీ.గల దారిని 12 మీ.లకు విస్తరించేందుకు రూ.4.17 కోట్లు కేటాయించారు. ఈ కనుమదారిని కలుపుతూ, ఆర్యవైశ్య భవనం చెంత నుంచి పై వంతెనను నిర్మిస్తున్నారు. వలయ దారిపైన పై వంతెనను లండన్ కేబుల్‌తో నిర్మించనున్నారు. స్టీల్ గడ్డర్లు రాగానే ఆ పనులు చేపట్టనున్నట్లు ఆర్అండ్‌బీ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఆ రోడ్డును మూసేశారెందుకో..క్షేత్రాభివృద్ధికి పూర్వం నిర్మించిన రెండో ఘాట్ రోడ్డు వినియోగించకుండా మూసివేశారు. ఆ దారి రెండో మలుపు వద్ద ఉత్తరాన కట్టిన పైవంతెనకు లింక్ చేయడంతో ప్రమాదం జరగొచ్చని కొండ కిందే వాహనాల రాకపోకలను నిషేధించారు. లింక్ చేసి చోట రింగ్ రోడ్డు నిర్మించకపోవడమే ఈ అసౌకర్యానికి కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి.

కనుమదారులను కలుపుతూ..కూలిన పాతఘాట్ రోడ్డు మరమ్మతుల్లో రూ.4.17 కోట్ల వ్యయంతో 12 మీటర్ల వెడల్పుతో రిటైనింగ్ వాల్ కడుతున్నారు. గతంలో 7 మీ. వెడల్పుగా ఉన్న ఆ దారిని 12 మీ.కు విస్తరించారు. 190 మీ. పొడవు ఉంటుంది. రెండు ఫ్లైఓవర్లు (పైవంతెనలు) రూ.69 కోట్ల వ్యయం ద్వారా ఒకటేమో తులసీ కాటేజీ చెంత నుంచి 480 మీ. పొడవుతో 12 మీ. వెడల్పు,. 1.5 మీటర్లు పాదచారులకు, 7.7 మీ. వెడల్పుగా వాహనాల కోసం నిర్మిస్తున్నారు. ఈ వంతెనలో 32 మీ. పొడవునా 8 స్లాబులను నిర్మిస్తారు. పనులు వచ్చే మార్చి నెలాఖరులోగా పూర్తవుతాయని సంబంధిత అధికారులు తెలిపారు.

# చిల్లరే.. లెక్కేస్తే లక్షలే..!

నల్గొండ : నల్గొండ పట్టణానికి చెందిన ఓ విశ్రాంత ఉద్యోగి ఇటీవల గ్యాస్ సిలిండరు మీద అదనపు వసూళ్లపై డెలివరీ బాయ్‌ను నిలదీశాడు. వెంటనే ఆ వ్యక్తి.. సిలిండరు ఇవ్వడానికి నిరాకరి ంచాడు. గట్టిగా మాట్లాడితే ఇంటి బయటే సిలిండరు వదిలేశాడు. చేసేదిలేక విశ్రాంత ఉద్యోగి పూర్తి మొత్తం ఇవ్వాల్సి వచ్చింది.నల్గొండ వెంకటేశ్వర కాలనీకి చెందిన ఓ గృహ వినియోగదారుడు ఇరవై రోజుల క్రితం గ్యాస్ తెప్పించుకున్నాడు. వాస్తవ సిలిండరు ధర కంటే.. అదనంగా రూ. 20 వసూలు చేశారు. సదరు గృహ వినియోగదారు ఇంటికి, గ్యాస్ గోదాముకు మధ్య దూరం కేవలం రెండు కిలోమీటర్ల లోపే.నల్గొండ జిల్లా కేంద్రంలోని గ్యాస్ ఏజెన్సీకి చైతన్యపురి కాలనీ 5 కి.మీ దూరం లోపే ఉంది. ఇక్కడ వంట గ్యాస్ డోర్ డెలివరీ చేసేందుకు సంబంధిత ఏజెన్సీ డోర్ డెలివరీ బాయ్ సిలిండర్ ధర కంటే అదనంగా 25 రూపాయలు వసూలు చేశాడు. సదరు గృహిణి మారుమాట్లాడకుండా ఆ మొత్తం ఇచ్చేశారు. ఉమ్మడి జిల్లాలో వంట గ్యాస్ సిలిండరు ధరపై అదనపు వసూళ్లు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం గృహావసరాల గ్యాస్ సిలిండరు ధర బహిరంగ మార్కెట్‌కు అనుగుణంగా మారుతోంది. ఒక్కో నెలలో పెరుగుతూ, మరో నెలలో తగ్గుతూ ఉండటం వల్ల వాస్తవ ధర వినియోగదారులకు స్పష్టంగా తెలిసే పరిస్థితి ఉండటం లేదు. ఇదే ఎక్కువనుకుంటే.. సిలిండరు అసలు ధర కంటే.. ఇంటికి అందించే సమయంలో అదనంగా వసూలు చేస్తుండటం మరింత భారమవుతోంది. ఈ వసూళ్లు చిల్లరగా కనిపించినా.. నెలనెలా ఇది లక్షల్లో సాగుతోంది.

ఎప్పటి నుంచో అక్రమ వసూళ్ల దందా

జిల్లాలో గ్యాస్ సిలిండరు సరఫరా అక్రమ వసూళ్ల దందా ఎప్పటినుంచో సాగుతున్నా.. అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఒక వైపు బిల్లులపై ఉన్న ధరకు అదనంగా చెల్లించవద్దని ఏజెన్సీ ప్రతినిధులు చెబుతున్నారు. మరోవైపు ఇంటికి తీసుకొచ్చే ఏజెన్సీ సిబ్బంది మాత్రం రూ.20 నుంచి రూ. 50 వరకూ ప్రాంతాన్ని బట్టి వసూలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే సిలిండరుపై రూ.20 నుంచి 30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. చాలామంది గృహిణులు వాస్తవ మొత్తాన్ని గమనించకుండా అడిగినంతా ఇచ్చేస్తున్నారు. కొంతమంది ప్రశ్నిస్తే.. దురుసుగా ప్రవర్తించడం, సిలిండరు వెనక్కి తీసుకెళ్లిపోయి, తాళం వేసి ఉందని నమోదు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. మరికొందరు తమకేమీ జీతం ఉండదని, తెచ్చినందుకు ఛార్జీల రూపంలో వచ్చేదే ఆదాయమని చెప్పడంతో మారుమాట్లాడకుండా ఆ మొత్తాన్ని ఇచ్చేస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీలు నిర్ణయించిన ధరే తాము వసూలు చేస్తున్నామని చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 50కి తక్కువ కాకుండా వసూలు చేస్తున్నారు. గ్రామాల్లో మహిళలు చాలామంది దీపం పథకాన్ని వినియోగిస్తున్నారు. వీరికి ఏజెన్సీలు చాలా కిలోమీటర్ల దూరంలో ఉంటున్నాయి. తాము వెళ్లి సిలిండర్లను తెచ్చుకోలేక, ఇంటికి తీసుకొస్తే అదనపు మొత్తం చెల్లించలేక గ్యాస్ వినియోగానికి దూరం అవుతున్నారు.

ఐదు కిలోమీటర్లు దాటితేనే..

గ్యాస్ సిలిండర్లకు అదనంగా వసూలు చేయవద్దని ఏజెన్సీలకు చెబుతున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. సిలిండరు డెలివరీ పరిధి ఐదు కిలోమీటర్ల లోపు ఉంటే ఉచితమేనని, పైసా కూడా అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదంటున్నారు. ఐదు నుంచి 30 కిలోమీటర్ల వరకైతే రూ.10 మాత్రమే అదనంగా వసూలు చేస్తారని తెలిపారు. ఏజెన్సీలు, సిబ్బంది వినియోగదారులను ఇబ్బంది పెట్టకూడదని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని అధికారులు వివరించారు.

ఏజెన్సీలు వాడేసుకుంటున్నాయి..!

గోదాం నుంచి వినియోగదారుడి ఇంటి వరకు సిలిండరును చేర్చి, ఖాళీ సిలిండరును మళ్లీ గోదాంలో చేర్చేందుకు గాను ప్రతి ఏజెన్సీకి సదరు కంపెనీలు రవాణా ఛార్జీలు చెల్లిస్తాయి. ఆ మొత్తాన్ని సిబ్బందికి ఇచ్చి, ఎమ్మార్పీకే సిలిండర్లను సరఫరా చేయాల్సిన బాధ్యత ఆయా ఏజెన్సీలదే. అయితే కంపెనీలిచ్చిన రవాణా ఛార్జీలను ఏజెన్సీలు వాడేసుకుంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఏజెన్సీలు తమకు జీతం ఇవ్వడం లేదని, వినియోగదారుల నుంచే వసూలు చేసుకోవా లంటున్నారని డెలివరీ బాయ్ ఒకరు తెలిపారు. సొంతవాహనంతో బండ చాకిరి చేస్తూ రూ. 20 మాత్రమే గ్యాస్ బండకు వసూలు చేస్తున్నట్లు వివరించాడు.మనకు చిల్లరే అయినా.. మొత్తంగా రూ. లక్షల్లోనే..ఉమ్మడి జిల్లాలో 71 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. సాధారణ, సీఎస్ఆర్, దీపం కలిపి మొత్తం 8,94,536 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి ఇంట్లోనూ గ్యాస్ వినియోగం తప్పనిసరైంది. ఇందులో ప్రతి నెలా క్రమం తప్పకుండా సిలిండరు తీసుకుం టున్న కనెక్షన్లు 4 లక్షలు వేసుకున్నా.. ఒక్కో వినియోగదారుడి నుంచి సగటున రూ. 20 అదనపు వసూళ్లు అనుకున్నా.. మొత్తంగా 80 లక్షల రూపాయలను చెల్లిస్తున్నట్లే. మనం చిల్లరే కదా అని వదిలేసిన మొత్తం ఒక నెలలో రూ. 80 లక్షలు.చర్యలు తీసుకుంటాం- పుల్లయ్య, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, సూర్యాపేటగ్యాస్ డెలివరీ బాయ్స్ సిలిండర్ సరఫరా సమయంలో అదనంగా రూ.30 వసూలు చేస్తున్నారన్న విషయం మా దృష్టికి రాలేదు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు చేపడతాం.

# పైవాళ్ల అండ.. అక్రమాలే నిండా..!

నల్గొండ : మితిమీరిన రాజకీయ జోక్యం, అడుగడుగునా పేరుకుపోయిన అవినీతి, అక్రమాలు, ఆలయ ఉద్యోగుల్లో అంతర్గత కలహాలు, అన్ని పనుల్లోనూ కమీషన్లు... వెరసి రాష్ట్రంలోనే ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన చెర్వుగట్టు దేవస్థాన ప్రతిష్ఠ రోజురోజుకూ మసకబారుతోంది. ఏళ్లుగా ఇక్కడే పాతుకుపోయిన కొందరు ఉద్యోగులు, పూజారుల మాయాజాలంతో ప్రతి విషయంలోనూ క్షేత్రానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. టెండర్ల ప్రకటన నుంచి దుకాణాల నిర్వహణ వరకు అందరికీ ఒక 'రేట్' నిర్ణయించి 'మేనేజ్' చేయడంతో కొందరు ఆడిందే ఆటగా ఇక్కడ సాగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోమవారాలు, అమావాస్య, ఇతర ప్రత్యేక దినాల్లో సుమారు 70 వేల మంది వరకు భక్తులు క్షేత్రానికి వస్తుండగా.. వారికి వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఏటా ఈ ఆలయానికి రూ.12 కోట్ల వరకు ఆదాయం వస్తున్నా మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదు. గట్టుపైకి వాహనాలు వెళ్లేటప్పుడు వసూలు చేసే పార్కింగ్ ఫీజు నుంచి మొదలుకొని తలనీలాలకు రూ.15 టోకెన్ ఉన్నా రూ.100-200 వసూలు చేయడం ఇలా అన్నింటా దోపిడేనని భక్తులు ఆరోపిస్తున్నారు. గట్టుపై కొబ్బరికాయ కనీస ధర కంటే ఎక్కువగా అమ్ముతున్నారని శుక్రవారం క్షేత్రానికి వెళ్లిన 'ఈనాడు ప్రతినిధి' పరిశీలనలో తేలింది. తాగునీటి కుళాయిల వద్ద స్వచ్ఛత లేకపోవడంతో భక్తులు నీళ్లసీసాలను ఆశ్రయిస్తున్నారు. లీటరు నీళ్లసీసా ధర రూ.20 ఉండగా రూ.35కు అమ్ముతున్నారు. ఇదేంటని అడిగితే తాము అధికమొత్తంతో టెండర్లు వేశామని, అందరికీ నెలానెలా ఇస్తే మాకు మిగిలేది ఏమీ ఉండదని వారు వెల్లడించడం గమనార్హం. అమ్మవారికి బోనం సమర్పించాలంటే కనీసం రూ.1000 వరకు చెల్లించాల్సిందే. పైన ఉన్న మూడుగుండ్ల దర్శనానికీ ఎలాంటి టోకెన్ ధరలు లేకున్నా ప్రతి భక్తుడు రూ.10 సమర్పించుకోవాల్సిందే. ఇక్కడి పరిస్థితులపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తాత్కాలిక వసతులేఏటా జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు అధికారులు తాత్కాలిక వసతులను మాత్రమే ఏర్పాటు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల అనంతరం వాటిని పట్టించుకోకపోవడంతో ఏటా రూ.లక్షల్లో నిధులు ఖర్చవుతున్నాయి. ఏటా జాతరకు వచ్చే భక్తులకు తాత్కాలిక ప్రాతిపాదికన మరుగుదొడ్లు, మంచినీరు, ఇతర వసతులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతమున్న మరుగుదొడ్లు క్షేత్రానికి కేవలం 500 మంది వచ్చినా సరిపోవని...పండుగలు, అమావాస్య లాంటి పర్వదినాల్లో 40 వేల మంది వరకు భక్తులు వస్తారని దేవస్థాన సిబ్బందే 'ఈనాడు'కు వెల్లడించడం ఇక్కడి దుస్థితికి అద్దం పడుతోంది. శాశ్వత ప్రాతిపాదికన పనులు చేస్తే ఏటా హీనపక్షం ఆలయానికి రూ.కోటి మిగులుతుందని దేవాలయ ఉద్యోగులు చెబుతున్నారు. మరోవైపు క్షేత్రంలో పరిశుభ్రత లోపించింది. నిత్యం వందల సంఖ్యలో స్నానం చేసే కోనేరు పరిసరాలు అపరిశుభ్రతకు తార్కాణంగా నిలుస్తున్నాయి. ఇక్కడ మహిళలు దుస్తులు మార్చుకోవడానికి సౌకర్యాలు లేవు. భక్తులు రాత్రి బస చేయడానికి ఉద్దేశించిన గంగ, గౌరి సదన్‌లలో గదులు, మరుగుదొడ్లు సైతం అపరిశుభ్రంగా ఉన్నాయి. తాత్కాలిక ఏర్పాట్లు చేయడం, వాటికి బిల్లులు తీసుకోవడం తప్పితే ఇక్కడి అధికారులు శాశ్వత నిర్మాణాలవైపు దృష్టి సారించడం లేదు.





# ఓబులాపురం మైనింగ్ కేసు... ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మిపై సుప్రీంకు సీబీఐ

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఐఏఎస్ అధికారిణి ఎర్ర శ్రీలక్ష్మిపై సుప్రీంకోర్టులో సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. ఓబులాపురం మైనింగ్ కేసులో శ్రీలక్ష్మిపై సీబీఐ నమోదు చేసిన అభియోగాలను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థ సుప్రీంను ఆశ్రయించింది. గనుల కేటాయింపుల్లో ఓబులాపురం మైనింగ్ కంపెనీకి ఆయాచిత లబ్ది కలిగించారని శ్రీ లక్ష్మిపై ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా శ్రీలక్ష్మి ఉన్నారు. ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల్లోనూ శ్రీలక్ష్మి ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.

పెన్నా సిమెంట్స్‌కు అక్రమంగా లబ్ది చేకూర్చిన కేసులో జగన్‌తో పాటు ఐఏఎస్ అధికారిని నిందితురాలిగా ఉన్నారు. పెన్నా సిమెంట్స్ కేసులో జగన్, ధర్మాన ప్రసాదరావు, పెన్నా ప్రతాప్ రెడ్డి, సబిత ఇంద్రారెడ్డిలతో పాటు శ్రీలక్ష్మి అభియోగాలను ఎదుర్కొంటున్నారు. అనంతపురంలోని రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో ఓబులాపురం మైనింగ్ కంపెనీ అక్రమ మైనింగ్ వ్యవహారాలపై సీబీఐ దర్యాప్తు చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు వాణిజ్య శాఖ కార్యదర్శిగా శ్రీలక్ష్మి సుదీర్ఘ కాలం పని చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పట్టణాభివృద్ధి శాఖ బాధ్యతలు నిర్వర్తించి సమర్థ అధికారిణిగా శ్రీలక్ష్మి పేరు తెచ్చుకున్నారు. తరువాత రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు వాణిజ్య శాఖ కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. సుదీర్ఘ కాలం పాటు పరిశ్రమలు, వాణిజ్య శాఖ బాధ్యతలు నిర్వహించారు. అయితే కుట్రకు పాల్పడ్డారని, అక్రమంగా మైనింగ్ లైసెన్సులు మంజూరు చేశారని శ్రీ లక్ష్మిపై సీబీఐ అభియోగాలు మోపింది.

గాలి జనార్ధన్ రెడ్డికి చెందిన ఓఎంసీ కంపెనీకి లైసెన్సులు మంజూరులో శ్రీలక్ష్మి తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని సీబీఐ ఆరోపించింది. 1988 బ్యాచ్‌కు చెందిన శ్రీలక్ష్మిని అక్రమ మైనింగ్ కేసులో 2011లో సీబీఐ అరెస్ట్ చేసింది. అయితే ఓబులాపురం మైనింగ్ కేసులో శ్రీలక్ష్మిపై సీబీఐ నమోదు చేసిన అభియోగాలను తెలంగాణ హైకోర్టు కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై సీబీఐ అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.




రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై తిరుగుబాటు చేసి ఆపై వెనక్కి తగ్గిన ప్రైవేటు సైన్యం వాగ్నర్ గ్రూపు అధినేత యెవ్‌గనీ ప్రిగోజిన్ (62) మరణంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన ప్రయాణించిన ఎంబ్రేర్ లీగసీ 600 ఎగ్జిక్యూటివ్ జెట్ కుప్పకూలిన విషయం తెలిసిందే. అయితే, ప్రమాదానికి 30 సెకన్ల ముందు వరకు ఈ విమానంలో ఎలాంటి సాంకేతిక సమస్య తలెత్తలేదని ఫ్లైట్ ట్రాకింగ్ డేటా ప్రకారం తెలుస్తోంది. చివరి క్షణాల్లో ఆ విమానం ఒక్కసారిగా కుప్పకూలినట్లు సమాచారం. ఫ్లైట్‌రాడార్ 24 సమాచారం ప్రకారం.. "బుధవారం సాయంత్రం 6.11 గంటల సమయంలో ఎంబ్రేర్ లీగసీ 600 నుంచి ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్‌కు ట్రాన్స్‌మిటింగ్ పొజిషన్ డేటా ఆగిపోయింది. అయితే, జెట్ నుంచి మరో 9 నిమిషాల పాటు మిగతా సమాచారం బదిలీ అయ్యింది. విమానం 28వేల అడుగుల ఎత్తులో ఉంది. అక్కడి నుంచి ఎత్తు క్షణానికోసారి వేగంగా మారిపోయింది. ఒక దశలో 30వేల అడుగుల ఎత్తుకు వెళ్లింది. కేవలం 30 సెకన్లలోనే విమానం 28వేల అడుగుల ఎత్తు నుంచి 8వేల అడుగులకు పడిపోయింది. ఆ తర్వాత కొద్ది సెకన్లకే విమానం కుప్పకూలింది.

**విమాన ప్రమాదంలో ప్రిగోజిన్ మృతి!** : ఫ్లైట్ రాడార్24 ప్రతినిధి పెటెర్‌నెక్ మాట్లాడుతూ.. "ఈ ప్రమాదం క్షణాల్లో జరిగిపోయింది. విమానం ఉన్నట్టుండి నిలువుగా కిందకు వచ్చింది.

30 సెకన్ల ముందు వరకు కూడా ఈ విమానంలో సమస్య ఉన్నట్లు ఎలాంటి సంకేతాలు రాలేదు" అని తెలిపారు. పొగలు వెలువరిస్తూ విమానం వేగంగా కిందకు వచ్చి కూలిపోయిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

**వాగ్నర్ సహ వ్యవస్థాపకుడు కూడా మృతి..** ఈ విమానం ప్రమాదంలో ప్రిగోజిన్‌తో సహా మొత్తం 10 మంది దుర్మరణం చెందినట్లు రష్యా ఫెడరల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ వెల్లడించింది. ఇందులో ఏడుగురు ప్రయాణికులు, ముగ్గురు సిబ్బంది ఉన్నారు. వారి పేర్లను విడుదల చేసింది. ప్రిగోజిన్‌తో పాటు, వాగ్నర్ గ్రూప్ సెకండ్-ఇన్ కమాండ్ దిమిత్రి ఉత్కిన్ కూడా ఈ ఘటనలో మృతిచెందినట్లు తెలుస్తోంది. ఈ ప్రైవేటు జెట్ విమానం మాస్కో నుంచి సెయింట్ పీటర్స్‌బర్గ్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన ప్రదేశంలో ఇప్పటివరకు 8 మృతదేహాలను గుర్తించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు రష్యా ప్రకటించింది.

**ప్రమాద సమయంలో పుతిన్ ఎక్కడ?** : ప్రిగోజిన్ ప్రయాణిస్తున్న విమానానికి ప్రమాదం జరిగిన సమయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ కుర్స్క్ ప్రాంతంలో ఉన్నట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. రెండో ప్రపంచ యుద్ధంలోని కుర్స్క్ పోరాటం 80వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారని తెలిపాయి. అంతకుముందు బ్రిక్స్ సదస్సుల్లో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. పశ్చిమ దేశాల మొదలుపెట్టిన యుద్ధాన్ని ముగించేందుకే తాము ఉక్రెయిన్‌లో సైనిక చర్య ప్రారంభించినట్లు పుతిన్ సమర్థించుకున్నారు.

**ప్రిగోజిన్ స్వీయ మరణ వారెంట్ ఇది: ఉక్రెయిన్** – కాగా.. ఈ ప్రమాదంపై ఉక్రెయిన్ స్పందిస్తూ ఇది అధ్యక్షుడు పుతిన్ పనే అని ఆరోపించింది. "ప్రిగోజిన్ మరణాన్ని చూస్తుంటే.. పుతిన్ ఎవరినీ క్షమించడు అనే విషయం స్పష్టమవుతోంది.

లుకషెంకో విచిత్ర హామీలు, పుతిన్‌పై నమ్మకం ఉంచి ఆ రోజు ప్రిగోజిన్ రాజీ ఒప్పందంపై సంతకం చేశారు. ఇప్పుడు అదే అతడి మరణ వారెంట్‌గా మారింది" అని ఉక్రెయిన్ అధ్యక్ష సలహాదారు మిఖైల్ పొడొలిక్ ఆరోపించారు.

# చిలకలూరిపేటలో పార్టీ పరిస్థితిపై విజయ సాయి రెడ్డి ఫైర్.. ఐప్యాక్ నివేదికలో షాకింగ్ నిజాలు!




పల్నాడు : పల్నాడు జిల్లా వైసీపీపై విజయ సాయి రెడ్డి సమీక్ష నిర్వహించారు. నరసరావుపేటలో పార్టీ ముఖ్య నేతలతో విడివిడిగా భేటీ అవుతున్నారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిపై విజయ సాయి రెడ్డి సమీక్ష నిర్వహించారు. చిలకలూరిపేటలో పార్టీ పరిస్థితిపై విజయ సాయి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారని తెలుస్తోంది. మంత్రి విడదల రజనీ వ్యవహారశైలిపై ఫిర్యాదులు వెల్లువెత్తాయని సమాచారం. ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయులు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌లతో సఖ్యత లేదని ఐప్యాక్ నివేదిక వెలువరించిందని సమాచారం. గ్రూపులతో నియోజకవర్గం పార్టీ పట్టు కోల్పోయిందని ఐ ప్యాక్ నివేదికలో పేర్కొందని సమాచారం. కలిసి పని చేయాలని విజయ సాయి రెడ్డి హెచ్చరించినట్లు సమాచారం.




# నిఘా ఉపగ్రహం ప్రయోగం విఫలం..!

అంతరిక్షంలోకి నిఘా ఉపగ్రహాన్ని చేర్చాలనుకొన్న ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌కు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఆ దేశం గురువారం ఉదయం చేపట్టిన నిఘా ఉపగ్రహ ప్రయోగం విఫలమైంది. మూడు నెలల క్రితం తొలిసారి ఉ.కొరియా చేసిన ప్రయోగం విఫలమై రాకెట్ సముద్రంలో కూలిపోయిన సంగతి తెలిసిందే. తాజాగా జరిగిన ప్రయోగంలో రాకెట్ మూడో దశలో విఫలమైనట్లు ఆ దేశ మీడియా సంస్థ కేసీఎన్ఏ వెల్లడించింది. యుద్ధ సమయంలో శత్రుదేశాలపై నిఘా పెట్టేందుకు, తమ దేశ పైలట్లకు సహాయకారిగా ఉండేందుకు నిఘా ఉపగ్రహ ప్రాజెక్టును కిమ్ సర్కారు చేపట్టింది. తాజా ప్రయోగ వైఫల్యంపై ఆ దేశ స్పేస్ ఏజెన్సీ స్పందిస్తూ.. అక్టోబర్‌లో మరో ప్రయోగం చేపడతామని వెల్లడించింది. రాకెట్ మూడో దశ ఎమర్జెన్సీ బ్లాస్టింగ్ వ్యవస్థలో లోపం కారణంగా ఈ ప్రయోగం విఫలమైందని కేసీఎన్ఏ కథనంలో పేర్కొంది. ఇదేమీ పెద్ద సమస్యకాదని వెల్లడించింది. దక్షిణ కొరియా నిఘా వర్గాల కథనం మేరకు.. ఎల్లో సీ మీదుగా ఉత్తరకొరియా రాకెట్‌ను ప్రయోగించింది. దీంతో జపాన్‌లో గగనతల రక్షణ వ్యవస్థలు స్పందించి ప్రజలకు అత్యవసర హెచ్చరికలు జారీ చేశాయి. ప్రజలు ఇళ్లలో తలదాచుకోవాలని పేర్కొన్నాయి. 20 నిమిషాల తర్వాత ఈ హెచ్చరికలను ఉపసంహరించుకొన్నారు. ఉత్తరకొరియా ప్రయోగాన్ని జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా ఖండించారు. "ఐరాస తీర్మానాలకు వ్యతిరేకంగా ఉత్తరకొరియా ప్రవర్తిస్తోంది. దీనికి తాము నిరసన వ్యక్తం చేస్తున్నాం" అని అన్నారు. మరోవైపు అమెరికా ఈ ప్రయోగంపై స్పందించింది. రెచ్చగొట్టే చర్యలను ఉత్తరకొరియా మానుకోవాలని సూచించింది. దౌత్యమార్గంలో సమస్యలు పరిష్కరించుకోవడంపై దృష్టిపెట్టాలని పేర్కొంది. అమెరికా, జపాన్, దక్షిణ కొరియా దేశాలు వాషింగ్టన్‌లో భేటీ నిర్వహించిన అనంతరం ఈ ప్రయోగం జరగడం విశేషం.

# పోలీసుల నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు సిద్ధమవుతున్న టీడీపీ

అమరావతి : పోలీసులు ఇచ్చిన నోటీసులకు ధీటుగా సమాధానం ఇచ్చేందుకు టీడీపీ సిద్ధమవుతోంది. గన్నవరం బహిరంగ సభ నిర్వహణపై యువగళానికి నిన్న పోలీసులు నోటీసులు ఇచ్చారు. గన్నవరం బహిరంగ సభ వేదికపై ముఖ్యమంత్రి జగన్, మంత్రి ఆర్.కె.రోజాల పరువు తీశారంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. తమ నోటీసులకు వివరణ ఇవ్వాలంటూ లోకేష్, కొనకళ్ల నారాయణకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిన ముఖ్యమంత్రిని నిలదీస్తే, పోలీసులకు అది తప్పుగా ఎలా కనిపించిందని టీడీపీ వర్గాలు అంటున్నాయి. తన ప్రసంగంలో లోకేష్, అయ్యన్న పోలీసులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రస్తావించారని టీడీపీ చెబుతోంది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి జరిగినప్పుడు బాధితులపైనే అక్రమ కేసులు పెట్టింది వాస్తవం కాదా? టీడీపీ నేతలు నిలదీస్తున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఇసుక దోపిడీని లోకేష్ ప్రశ్నిస్తే, పోలీసులెందుకు అధికార పక్షాన్ని వెనకేసుకొస్తున్నారని తెలుగుదేశం వర్గాలు ప్రశ్నిస్తున్నారు. అయ్యన్న వ్యాఖ్యలు తప్పైతే పర్యాటకాభివృద్ధికి రోజా ఏం చేసిందో పోలీసులు సమాధానం చెప్తారా? అని నిలదీస్తున్నారు. వీటన్నింటిని సభా వేదిక ద్వారా ప్రశ్నించడం తప్పెలా



అవుతుందని నేతలు అడుగుతున్నారు. టీడీపీ హయాంలో ఉచిత ఇసుక ఇవ్వడం జరిగిందని.. ఇప్పుడు ఇసుక ధరలు అధికంగా పెరిగి, భవన నిర్మాణ రంగం కుదేలవటానికి ముమ్మాటికీ జగన్ అవినీతే కారణమని టీడీపీ స్పష్టం చేస్తోంది. ఇదే అంశాన్ని లోకేష్ ప్రస్తావించటం తప్పు ఎలా అవుతుందని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ పార్టీ సభలో ప్రభుత్వ తప్పిదాలు ప్రశ్నించి, హామీల విస్మరణను విమర్శిస్తే పోలీసులకు సంబంధం ఏముంటుందని తెలుగుదేశం నేతలు ప్రశ్నిస్తున్నారు.

# ముందస్తు ఎన్నికలపై మంత్రి కొట్టు ఆసక్తికర వ్యాఖ్యలు

నంద్యాల: ఏపీలో ముందస్తు ఎన్నికలు రాబోతున్నాయంటూ జోరుగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ స్పందించారు. రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు రావాలసిన అవసరం లేదని.. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని మంత్రి స్పష్టం చేశారు. మంత్రి ఇంకా మాట్లాడుతూ.. రాష్ట్రంలో వర్షపాతం తక్కువగా ఉందని అందుకే శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండలేదని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు కురిసి ప్రాజెక్టులు నిండాలని రేపటి (శుక్రవారం) నుంచి ఏడు రోజులపాటు శ్రీశైలం ఆలయంలో వరుణ యాగాలు, జపాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. శ్రీశైలం క్షేత్రానికి ఏడు ఐఎస్ఓ సర్టిఫికెట్లు వచ్చాయని.. అంతర్జాతీయ గుర్తింపు ఐఎస్ఓ ద్వారా రావడం సంతోషంగా ఉందన్నారు. శ్రీశైలం క్షేత్రంలో పెద్ద ఎత్తున జరుగనున్న అభివృద్ధి



కార్యక్రమాలకు వచ్చేనెలలో సీఎం జగన్ శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. శ్రీశైలం క్షేత్రం పరిధిలో చిరుత పులులు, ఎలుగుబంట్లు, వన్యప్రాణులు రాకుండా చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామని మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు.

# నారా లోకేష్‌తో వంగవీటి రాధా ఏకాంత భేటీ




విజయవాడ: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌తో మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా ఏకాంతంగా భేటీ అయ్యారు. గురువారం యువగళం పాదయాత్ర విరామ సమయంలో లోకేష్‌తో సమావేశం అయ్యారు.

దాదాపు 20 నిమిషాల పాటు చర్చలు జరిపారు. ఈ భేటీ విషయాన్ని అత్యంత గోప్యంగా ఉంచారు. ఇటీవల యువగళం పాదయాత్రలో వంగవీటి రాధా వరసగా పాల్గొంటున్నారు. కాగా రాధా లోకేష్ భేటీపై రాజకీయ వర్గాల్లో సర్వత్ర ఆసక్తి నెలకొంది. కాగా బాపులపాడు మండలం, రంగన్నగూడెంలో నారా లోకేష్ పాదయాత్రలో కొద్ది సేపు హై టెన్షన్ వాతావరణం చోటు చేసుకుంది. లోకేష్ పాదయాత్రలో కవ్వింపు చర్యలకు పాల్పడుతూ వైసీపీ బ్యానర్ ఏర్పాటు చేసింది. బ్యానర్‌పై వైసీపీ హయంలో రెండు కోట్ల 71 లక్షల రూపాయలతో పనులు చేసిన వివరాలను వైసీపీ కార్యకర్తలు పొందుపరిచారు. వైసీపీ నాయకులతో ఫోటో వేయడాన్ని టీడీపీ శ్రేణులు తప్పు పట్టాయి. బాపులపాడు మండలం రంగన్నగూడెంలో కొడాలి నాని, వల్లభనేని వంశీ ఫొటోలతో బ్యానర్లు ఏర్పాటు చేశారు. లోకేష్ పాదయాత్ర రంగన్న గూడెంకు రాగానే బ్యానర్ వద్ద నిలబడి టీడీపీ నేతలను వైసీపీ శ్రేణులు కవ్వించాయి. వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య కొద్దిసేపు తోపులాట, వాగ్వాదం జరిగింది. టీడీపీ శ్రేణులు తిరగబడటంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే పోలీసులు సైతం వైసీపీ కవ్వింపు చర్యలన్ని నియంత్రించలేదు.

ఈ క్రమంలోనే ఫ్లెక్సీని తొలగించాలంటూ పోలీసులతో దేవినేని ఉమ వాగ్వాదానికి దిగారు. వైసీపీ శ్రేణులకు మద్దతుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని టీడీపీ మండిపడింది. వైసీపీ నేతల భద్రత కోసం భారీగా పోలీసుల్ని మోహరించారంటూ టీడీపీ ఆరోపణలు చేసింది. చివరకు ఫ్లెక్సీని తొలగించడంతో వివాదం సద్దుమణిగింది.

# విజయవాడలో భారీ అగ్ని ప్రమాదం.. అగ్నికి ఆహుతైన 500 బైక్‌లు



విజయవాడ: విజయవాడలో భారీ అగ్ని ప్రమాద ఘటన చోటుచేసుకుంది. నగరంలోని టీవీఎస్ షోరూంలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో మంటల్లో వందలాది కొత్త బైక్‌లు కాలి బూడిదవ్వడంతో భారీగా ఆస్తి నష్టం జరిగింది. వివరాల ప్రకారం.. విజయవాడలో స్టెల్లి కాలేజీ సమీపంలోని టీవీఎస్ షోరూంలో గురువారం తెల్లవారుజామున 5 గంటలకు ప్రమాదం జరిగింది. అన్‌లోడ్ చేస్తున్న సమయంలో పై ఫ్లోర్ నుంచి మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా భారీ ఎత్తున మంటలు ఎగిసిపడటంతో టీవీఎస్ షోరూంలో ఉన్న 500 బైక్‌లు అగ్నికి ఆహుతయ్యాయి. మంటల్లో కొత్త బైక్‌లు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదం కారణంగా భారీ ఆస్తి నష్టం జరిగినట్టు తెలుస్తోంది. కాగా ఎలక్ట్రిక్ బైక్స్ వల్ల ప్రమాదం జరిగిందా? లేదా షార్ట్ సర్క్యూట్ జరిగిందా అనే అనుమానం వ్యక్తమవుతోంది. అయితే సర్వీస్ సెక్షన్‌లోని లూబ్రికెంట్స్ అగ్నికి ఆజ్యం పోశాయి. ప్రమాదం జరిగినపుడు సిబ్బంది లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. చుట్టు పక్కల జనావాసాలకు మంటలు వ్యాపించకుండా ఫైర్ సిబ్బంది అదుపుచేసింది. సమాచారం అందుకున్న పడమట పోలీసులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# నారా లోకేష్‌ను కలిసిన రంగన్నగూడెం గ్రామస్తులు

విజయవాడ: జగన్మోహన్‌రెడ్డి చేతగాని, దివాలాకోరు పాలన గ్రామాలకు శాపంగా మారిందని తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు.

గురువారం నారా లోకేష్‌ను గన్నవరం నియోజకవర్గంలోని రంగన్నగూడెం గ్రామస్తులు కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తులు లోకేష్‌తో మాట్లాడుతూ.. "వీరవల్లి-రంగన్నగూడెం గ్రామాల మధ్య 332క్రాసింగ్ గేటు వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా ప్రారంభించాలి. వీరవల్లి-వట్టిగుడిపాడు రోడ్డు 7మీటర్ల వెడల్పుకు పెంచి నిర్మించాలి. రంగన్నగూడెం - వేలేరు వెళ్లే మండల పరిషత్ లింకు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలి. రంగన్నగూడెం గ్రామంలోని అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చాలి. పోలవరం కుడి ప్రధాన కాలువ 129 కి.మీ వద్ద స్లూయిస్ నిర్మించాలి. పోలవరం కుడి ప్రధాన కాలువ 130కి.మీ వద్ద ఆర్ అండ్ బీ రోడ్డు ప్రక్కన స్లూయిస్ నిర్మించాలి" అని గ్రామస్తులు కోరారు.

**గ్రామస్తుల విన్నపంపై నారా లోకేష్ స్పందన..** "గ్రామపంచాయితీలకు కేంద్రం ఇచ్చిన ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.9వేల కోట్లను జగన్ ప్రభుత్వం దొంగిలించింది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయి, కనీసం మంచినీళ్లు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. గత తెలుగుదేశం హయాంలో 25వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 30లక్షల ఎల్.ఈ.డీ వీధిదీపాలు వేశాం. గ్రామాల్లో రోడ్లు, లింకు రోడ్లు, ఇంటర్నల్ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. వైసీపీ పాలనలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తిచేస్తాం. పోలవరం కుడి ప్రధాన కాలువపై అవసరమైన ప్రాంతాల్లో స్లూయిస్‌లు నిర్మిస్తాం" అని లోకేష్ అన్నారు.

## నటి కాకపోతే జాన్వీ సంచార జీవితం!

అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా తెరంగేట్రం చేసిన జాన్వీకపూర్ కెరీర్ బాలీవుడ్ లో దేదీప్యమానంగా సాగిపోతుంది. యువ హీరోలకు పర్ఫెక్ట్ జోడీగా రాణిస్తుంది. బయోపిక్ ల్లో సైతం నటిస్తూ సత్తా చాటుతుంది. ఇటీవలే టాలీవుడ్ లో నూ లాంచ్ అయింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ 30వ సినిమా తో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించబోతుంది. నిజ జీవితంలో జాన్వీ ఊహించిందే. తల్లి అగ్ర తారగా కొనసాగారు. తండ్రి పెద్ద నిర్మాత. అలాంటి బ్యాక్ గ్రౌండ్ నుంచి వచ్చే వారసులు తప్పకుండా నటులే అవుతారని ఎవరైనా ఊహిస్తారు. దాదాపు అలాంటి వారి అందరి జీవితాలు తాము కొరుకున్న విధంగానే ఉంటాయి. అయితే ఒకవేళ జాన్వీ నటికాకపోతే మరో ఆప్షన్ ఏదైనా పెట్టుకుందా? అంటే అవుననే అంటుంది. జాన్వీ నటికాకపోతే ప్రపంచమంతా సంచారిలో చుట్టేసిదిట. సంచార జీవితం అంటే ఎంతో ఇష్టమట. నటి కాకపోతే ప్రపంచం చుట్టేసి కొత్త



వ్యక్తుల్ని కలుసుకునే దాన్ని. అదీ కుదరకపోతే రచయిత్రి అయ్యే దాన్ని అని తెలిపింది. సంచార జీవితం అన్నది సాహసంతో కూడుకున్నది. ప్రపంచాన్ని సాధారణంగా చుట్టేయడం వేరు. అడ్వెంచర్స్ గా మలుచుకోవడం వేరు. ఇక్కడ కూడా జాన్వీ అడ్వెంచర్ గానే ప్రయాణం సాగించడాన్ని ఇష్టపడింది. ఎక్కువగా ప్రకృతితో గడపాలని ఇష్టపడుతుందిట. వాయు కాలుష్యానికి దూరంగా చుట్టూ పచ్చిన వాతావరణ ఉంటే ఎంతో ఇష్టమట. అందుకోసం ఎక్కువగా మాల్దీవులకు వెళ్తుందిట. అలాగే ప్రశాంతత కోసం మూడు నెలలకు ఒకసారైనా తిరుపతి శ్రీవారి దర్శనం చేసుకుంటుందిట. మొత్తానికి అమ్మడిలో కొన్ని మంచి క్వాలిటీలు ఉన్నాయని తెలుస్తోంది. ఇలా ప్రపంచాన్ని చుట్టేయడం అంటే డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాధ్ కి ఎంతో ఇష్టం. ఖాళీగా ఉంటే బ్యాగేసుకుని ప్రపంచ దేశాలన్ని చుట్టడం ఆయనకు అలవాటు. ఆ అలవాటు నుంచి పుట్టిందే హార్ట్ ఎటాక్ లో నితిన్ క్యారెక్టర్. ఆ సినిమా ప్రచార సమయంలోనే పూరికి ప్రపంచ యాత్ర చేయాలని ఉందన్న విషయాన్ని రివీల్ చేసారు. కొత్త అన్వేషణలు అంటే ఆయనకు ఎంతో ఇష్టం.

## రెండు బ్లాక్ బస్టర్ హిట్లు కొట్టి ఫోటోలకి పరిమితమైన హీరోయిన్..!

కన్నడ సెన్సేషనల్ మూవీ కె.జి.ఎఫ్ తో వెండితెరకు పరిచయమైంది శ్రీనిధి శెట్టి. మొదటి సినిమానే హిస్టరీ క్రియేట్ చేసింది. ఆ తర్వాత ఆ సినిమా సీక్వెల్ లో కూడా అమ్మడు భాగమైంది. కె.జి.ఎఫ్ 1 2 సినిమాల హిట్లకు తను కూడా భాగమైంది. అయితే అంత పెద్ద హిట్లు కొట్టిన శ్రీనిధి కెరీర్ లో ఆ దూకుడు చూపించట్లేదని చెప్పొచ్చు. కె.జి.ఎఫ్ 2 తర్వాత విక్రం తో కోబ్రా సినిమా చేసింది శ్రీనిధి కానీ ఆ సినిమా రిజల్ట్ తేడా కొట్టడంతో అమ్మడు సైలెంట్ అయ్యింది. ఎంట్రీ గ్రాండ్ గా ఇచ్చినా తర్వాత సినిమాల విషయంలో కన్ ఫ్యూజ్ అవుతుంది శ్రీనిధి. అంతేకాదు తన దగ్గరకు వచ్చిన నిర్మాతలకు రెమ్యునరేషన్ పరంగా కూడా ఎక్కువ అడిగి షాక్ ఇస్తుందట. శ్రీనిధి ఇదంతా తెలిసి చేస్తుందా లేక తెలియక చేస్తుందా అన్నది చెప్పడం



కష్టం. సినిమాలు చేయకుండా ఫోటో షూట్స్ తో కాలం వెళ్లదీస్తుంది అమ్మడు. కె.జి.ఎఫ్ లాంటి సినిమా చేసిన హీరోయిన్ వరుసగా ఐదారు సినిమాలతో బిజీగా ఉంటుందని అనుకుంటే ఇలా ఖాళీగా ఉంటూ ఫోటోలు షేర్ చేస్తుంది. కెరీర్ గైడెన్స్ లో ఆమెకు ఎవరు సపోర్ట్ గా నిలవట్లేదా ఏంటో కానీ శ్రీనిధి క్రేజ్ ఉన్నప్పుడే క్యాష్ చేసుకోవాలని తెలియట్లేదు. తెలుగులో ఒకటి రెండు సినిమాల డిస్కషన్స్ జరిగినా అమ్మడికి నచ్చలేదో లేక ఏమైందో కానీ ఆ అవకాశాలను మిస్ చేసుకుందట. కోబ్రా తర్వాత శ్రీనిధి మరే సినిమాకు సైన్ చేయలేదు. అయితే ఆడియన్స్ కు మాత్రం తన ఫోటో షూట్స్ తో అలరిస్తుంది. సినిమాలు చేయాలి కానీ ఇలా ఫోటో షూట్స్ ఎంత చేసినా ఏం లాభమని కొందరు అంటున్నారు. జీరో సైజ్ పర్ఫెక్ట్ అవుట్ ఫిట్ తో కుర్రాళ్ల హృదయాలను గాయం చేస్తున్న శ్రీనిధి వరుస సినిమాలు చేస్తే ఎంకరేజ్ చేసేందుకు ప్రేక్షకులు రెడీగా ఉన్నారు. సినిమాల విషయంలో అమ్మడు సీరియస్ గా ఉంటే బెటర్ ఇలా సైలెంట్ గా ఉంటే ఫేడవుట్ అయ్యే ఛాన్స్ కూడా ఉంటుంది.




## హారర్ టెర్రర్: గజగజ ఒణికించే టాప్ ఓటీటీ షోలు




ఎన్ని జానర్లు ఉన్నా హారర్ జానర్ కి ఉన్న ప్రత్యేకతే వేరు. భయపెట్టగలిగితే చాలు.. ఆడియెన్ ని థియేటర్లకు రప్పించడం కష్టం కాదని ప్రూవ్ అయింది. కాంచన సిరీస్ సహా చాలా హారర్ థ్రిల్లర్ లు ప్రేక్షకులను అలరించాయి. అయితే ఇటీవల ఓటీటీలో దడ పుట్టించే కంటెంట్ తో టాప్ వెబ్ సిరీస్ లు ఏవి? అన్నది పరిశీలిస్తే తెలిసిన సంగతులివి.. అనన్య బెనర్జీ- గౌరవ్ కె చావ్లా దర్శకత్వం వహించిన 'అధుర' ఒళ్లు ఝులదరించే హారర్ స్టోరీతో తెరకెక్కించిన సిరీస్. 'బోర్డింగ్ స్కూల్' చుట్టూ తిరిగే ఒక అతీంద్రియ శక్తి కథతో భయానక భీభత్స సన్నివేశాలతో కదిలిస్తుంది.

మనస్సును కదిలించే రహస్యాలను తెరపై రివీల్ చేసారు. సుజోయ్ ఘోష్ దర్శకత్వం వహించిన 'టైప్‌రైటర్' హారర్ జానర్ లో ఆసక్తిని రేకెత్తించే సిరీస్. కొందరు పరిశోధకులు హాంటెడ్ విల్లాలో ప్రవేశించాక ఏం జరిగిందనేదే ఈ సినిమా. కానీ కొత్త కుటుంబం ఆ విల్లా తాలూకా వింత గతాన్ని ఆవిష్కరించిన తీరు ఆసక్తిని కలిగిస్తుంది. ఈ చిత్రంలో పలోమి ఘోష్, పురబ్ కోహ్లీ, సమీర్ కొచ్చర్ నటించారు. హిందీ హర్రర్ సిరీస్ ఇది. అంకహి అన్సుని.. టైటిల్ కి తగ్గట్టే ఆసక్తికర కథ హారర్ నేపథ్యంతో రూపొందిన సిరీస్ ఇది. అతి పిన్న వయస్కుడైన %ఖూ% ఇన్‌స్పెక్టర్ ఉమేష్ జాగీకి ఎదురైన సవాళ్లు ఏమిటి? అపరిష్కృతమైన నేరాలు - వింత సంఘటనల పట్టణంలో అతడు క్రైమ్ వెనక అసలు నిజాల్ని కనుగొన్నారా లేదా? అన్నదే ఈ సిరీస్ కథాంశం. భయపెట్టే థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ తో తెరకెక్కిన సిరీస్ ఇది. బేతాళ్.. హారర్ కాన్సెప్ట్ వెబ్ సిరీస్. ప్రత్యేక దళాలు మారుమూల గ్రామంలో మరణించని మనుషుల వల్ల భయాందోళనలను ఎదుర్కొంటాయి. బ్రిటిష్ అధికారులు జాంబీలుగా మారాక ఏం జరిగింది? అన్నది తెరపై చూడాలి. మనుగడ అంటే భయాలు చీకటి చరిత్రను ఎదుర్కోవడం.. అనేది థీమ్ లైన్. బేతాళ్ పూర్తిగా భయపెట్టే సిరీస్. కన్నమూచీ (హైడ్ అండ్ సీక్).. తమిళ వెబ్ సిరీస్ ఇది. ఒంటరి తల్లి, చెవిటి కూతురు, చెన్నైలోని హాంటెడ్ అపార్ట్‌మెంట్‌కు మారాక ఏం జరిగిందనేది ఈ సిరీస్ కథాంశం. కూతురు అదృశ్యానికి గత హత్య లింకులు దడ పుట్టిస్తాయి. గ్రిప్పింగ్ కథలో మిస్టరీ రివీలవుతుంది.. హారర్ టెర్రర్ తో సిరీస్ రక్తి కట్టిస్తోంది.

జీ5లో స్ట్రీమింగ్ అవుతోంది. గెహ్రైయాన్.. ఒక హారర్ థ్రిల్లర్. బెంగుళూరులో ఒక బాధాకరమైన అనుభవాన్ని ఎదుర్కొన్న తర్వాత, రేనా ముంబైకి వెళుతుంది. ఇక్కడ, ఆమె పారానార్మల్ యాక్టివిటీస్ కి టార్గెట్ గా మారుతుంది. పారా నార్మల్ యాక్టివిటీస్ సినిమా తరహాలోనే దడ పుట్టించే హారర్ థ్రిల్లర్ సిరీస్ ఇది. పిశాచం.. టైటిల్ కి తగ్గట్టే గుబులు పెంచే సిరీస్ ఇది. రిమోట్ డిటెన్షన్ సెంటర్‌లోని మిస్టీరియస్ ఖైదీ దెయ్యాల ఉనికిని కనిపెట్టాక ఏం జరిగిందో సిరీస్ లో చూడాలి. నిదా రహీమ్ (రాధిక ఆప్టే) చిల్లింగ్ ఈవెంట్‌లలో వింతైన అరబిక్ జానపద కథలను తెరపై చూపారు.

## సామ్ ఆ క్షణం.. ఎటో వెళ్లిపోయింది మనసు...!



ఎటో వెళ్లిపోయింది మనసు.. ఇలా ఒంటరయ్యింది వయసు...! యాథృచ్ఛికంగా అయినా కానీ ఇక్కడ సమంత ఫోజ్ చూస్తుంటే నిన్నే పెళ్లాడుతా పాట గుర్తుకు వస్తుంది.. ! సమంతను ఇలా చూస్తుంటే ఫ్యాన్స్ ఏవో ఆలోచనల్లోకి వెళ్లిపోవడం ఖాయం. మయో సైటిస్.. వ్యక్తిగత జీవితం.. కెరీర్ స్పీడ్ ఇవేవీ తనకు పట్టవు అన్నట్టుగా ఉంది ఈ వాలకం. గతాన్ని మరిచి వర్తమానంలో జీవించడం ఒక గొప్ప కళ. దానిని అలవాటు చేసుకుంటేనే నేటిలోకంలో ముందుకు సాగడం సులువు. డబ్బు ఎంత ఉన్నా జీవించడం అనే కళను కొనలేం. ఈ సత్యాన్ని గ్రహించినట్టుగా సమంత ఇలా తన లైఫ్ ని ప్రశాంతవదనంతో ప్లాన్ చేసిందనే అనిపిస్తోంది. ప్రకృతితో మమేకం అయ్యి అన్నిటినీ మర్చిపోతోంది. నిశీధిలో నిశ్శబ్ధ యోగినిలా మారింది. న్యూయార్క్ సెంట్రల్ పార్క్ లో సామ్ విహారానికి సంబంధించిన ఫోటోలు ఇవి. అక్కడ ఇలా సింపుల్ గా కాలాన్ని ముందుకు నెట్టుకొచ్చేస్తోంది. మరోవైపు ఊరపిచ్చుకల వీడియోని కూడా సమంత షేర్ చేసింది. తాజాగా సమంత రివీల్ చేసిన ఫోటోషూట్ పరిశీలిస్తే తనలో ఆలోచనలు అంతర్మథనానికి ఇవి సింబాలిక్ గా కనిపిస్తున్నాయ్. ప్రశాంతమైన జీవితాన్ని ప్లాన్ చేస్కోవడాన్ని బట్టే ఉంటుందనడానికి ఈ లైఫ్ ఉదాహరణ. సమంత ఇప్పటికే దేవరకొండతో ఖుషీ షూటింగ్ పూర్తి చేసింది. తదుపరి వరుస చిత్రాల్లో నటించేందుకు సన్నాహకాల్లో ఉంది. మరోవైపు మయోసైటిస్ కి చికిత్స కోసం అమెరికా వెళ్లిందంటూ కొన్ని మీడియాల్లో ప్రచారం సాగుతోంది. ఏది ఏమైనా సామ్ ఆల్వేస్ హ్యాపీ ఇండివిద్యువల్ ఉమెన్.. అనడానికి ఇవిగో ఈ ఫోటోలే తార్కాణం.

## ఎంట్రీకి ముందే పర్ఫెక్ట్ ప్లాన్.. సంయుక్త స్కెచ్ అదుర్స్..!

మలయాళ భామ సంయుక్త మీనన్ తెలుగులో సూపర్ ఫాం లో ఉంది. తన సినిమా ఎంట్రీ అంతా అలా జరిగిపోయిందని తన ఫేస్ బుక్ ఫోటోని చూసి ఒక డైరెక్టర్ కు ఒక కెమెరా మెన్ రిఫర్ చేయగా ఆడిషన్ కు పిలిచి సినిమా ఛాన్స్ ఇచ్చారని అన్నది. అంతేకాదు ఒక సినిమా చేసి సినిమాలు ఆపేద్దామనుకున్నా కానీ ఇక్కడ ప్రేక్షకుల ఆదరణ చూసి వరుసగా చేస్తూ వస్తున్నా అన్నది సం యుక్త. భీమ్లా నాయక్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన అమ్మడు ఆ సినిమా ఆఫర్ రాగానే ట్యూటర్ ని పెట్టుకుని మరీ తెలుగు నేర్చుకున్నానని అన్నది. భీమ్లా నాయక్ ఈవెంట్ లో తెలుగు లో మాట్లాడటం చూసిన పవన్ కళ్యాణ్ చాలా బాగా మాట్లాడారని చెప్పారు. ఇక భీమ్లా నాయక్



సినిమా తర్వాత తనని అందరు డ్యానియల్ భార్య అని పిలుస్తున్నారని. పవన్ కళ్యాణ్ సిస్టర్ అంటున్నారని చెప్పుకొచ్చింది. తనకు ట్రావెలింగ్ చాలా ఇష్టమని ఒక్కదాన్నే ఎక్కడికైనా వెళ్తుంటానని అన్నది. హిమాలయాలకు వెళ్లొచ్చానని చెప్పింది సంయుక్త. అమ్మ నాన్న చిన్నప్పుడే విడిపోవడం వల్ల తన మదర్ దగ్గరే తను పెరిగానని. అందుకే తన తండ్రి ఇంటి పేరు మీనన్ ను ఇక మీదట వాడకూడదని అనుకున్నానని అన్నారు. ఇక హీరోయిన్ గా సెటిల్ అవకపోతే ట్రావెలర్ గా కెరీర్ ఎంచుకునే దాన్ని అని చెప్పింది అమ్మడు. అంతేకాదు ట్రావెలింగ్ అంటే ఇష్టం ఉండటం వల్ల తన వీపు మీద ట్రావెలర్ అనే ట్యాటూ కూడా వేయించుకున్నా అన్నది. కాలేజ్ డేస్ లో ధనుష్ ఆడుకాలం సాంగ్ కు ఫ్రెండ్స్ తో కలిసి డ్యాన్స్ చేశా ఇప్పుడు అదే ధనుష్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నా ఇది నిజంగా తను ఊహించలేదని అని చెప్పారు సంయుక్త. తెలుగులో మంచి ఫాం లో ఉన్న అమ్మడు తన ప్రతి సినిమాతో హిట్ అందుకోవడంతో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. సంయుక్త ఉంటే సినిమా హిట్ అన్న క్రేజ్ రావడంతో ఆమెతో సినిమాకు దర్శక నిర్మాతలు క్యూ కడుతున్నారు. ప్రస్తుతం మరో రెండు సినిమాలకు సైన్ చేసిన సంయుక్త తన లక్కీ ఫాం కొనసాగిస్తుందని చెప్పొచ్చు. సంయుక్త ను తెలుగు తెరకు పరిచయం చేసిన సితార బ్యానర్ లోనే మరో సినిమా కూడా ఆమె చేస్తుందని తెలుస్తుంది.

## అనసూయ వెబ్ సీరీస్ ఒక్క అడుగైనా పడిందా..?

జబర్దస్త్ యాంకర్ అనసూయ ప్రముఖ దర్శకుడు క్రిష్ డైరెక్షన్ లో ఒక మెగా వెబ్ సీరీస్ ప్లాన్ చేశారని తెలిసిందే. జబర్దస్త్ చేస్తూనే అడపాదడపా సినిమాలు చేస్తూ వచ్చిన అను సినిమాల్లో బిజీ అవడం వల్ల జబర్దస్త్ కు గుడ్ బై చెప్పేసింది. అయితే అనసూయ జబర్దస్త్ కు బై బై చెప్పడానికి వెనుక రీజన్ క్రిష్ తో చేసే వెబ్ సీరీస్ అని టాక్ వచ్చింది. గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం నవల ఆధారంగా ఈ వెబ్ సీరీస్ రాబోతుంది. వెబ్ సీరీస్ గురించి సోషల్ మీడియా లీకులు తప్ప అఫీషియల్ ఎనౌన్స్ మెంట్ అయితే రాలేదు. ఈ వెబ్ సీరీస్ లో అనసూయ వేశ్య పాత్రలో నటించనుంది. సోషల్ మీడియా హడావిడే తప్ప ఈ వెబ్ సీరీస్ ఇప్పటివరకు సెట్స్ మీదకు వెళ్లింది లేదు. అనసూయ కూడా సినిమా ఆఫర్లు వస్తున్నాయి కదా అని రెగ్యులర్ గా వచ్చే జబర్దస్త్ పేమెంట్ ని వదిలేసుకుంది.



అనసూయతో క్రిష్ వెబ్ సీరీస్ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. అనసూయ మాత్రం రంగస్థలం పుష్ప లాంటి సినిమాల్లో ప్రత్యేక పాత్రలో నటిస్తూ వస్తుంది. బుల్లితెర మీద హాట్ ఇమేజ్ తెచ్చుకున్న అనసూయ వేశ్య పాత్రలో నటిస్తుందని అనగానే ఆడియన్స్ లో ఆసక్తి మొదలైంది. ఈ వెబ్ సీరీస్ మొదలవ్వాలి అంటే పవన్ తో క్రిష్ చేస్తున్న వీరమల్లు సినిమా పూర్తి కావాలి. రెండేళ్లుగా సెట్స్ మీద ఉన్న ఈ సినిమాకు పవన్ డేట్స్ అడ్జెస్ట్ అవకపోవడం తో ఇప్పటికీ పూర్తి కాలేదు. పవన్ దీనితో పాటుగా మిగతా సినిమాలు కూడా చేస్తుండటం వల్ల వీరమల్లు సినిమా ఇంకా పెండింగ్ ఉంది. క్రిష్ పవన్ సినిమా పూర్తి చేసి అది రిలీజ్ అయ్యాకనే అనసూయ వెబ్ సీరీస్ పై ఫోకస్ చేసే అవకాశం ఉంది. అప్పటివరకు అనసూయ ఎదురుచూడక తప్పదు. అనసూయ కన్యాశుల్కం వెబ్ సీరీస్ పై ఆడియన్స్ లో ఇంట్రెస్ట్ ఏర్పడింది. ప్రముఖ ఓటీటీ సంస్థ ఈ వెబ్ సీరీస్ ను ప్లాన్ చేస్తున్నారు. ఈ వెబ్ సీరీస్ కోసం అనసూయ భారీ రెమ్యునరేషన్ అందుకుంటుందని తెలుస్తుంది.




## రెండ్రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్.. మంత్రి సబితా ఇంద్రారెడ్డి కీలక ప్రకటన

పాఠశాల విద్యకు సంబంధించి టీచర్ పోస్టుల భర్తీకి త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. 6,500 పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఆమె తెలిపారు. పాఠశాల విద్యలో 5,089 పోస్టులు, ప్రత్యేక విద్యార్థుల పాఠశాలల్లో 1523 పోస్టుల భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈసారి టీఎస్‌పీఎస్సీ ద్వారా కాకుండా డీఎస్సీ ద్వారానే పోస్టుల భర్తీ చేస్తామని చెప్పారు.

దీనికి సంబంధించి రెండ్రోజుల్లోనే నోటిఫికేషన్, విధివిధానాలను విడుదల చేస్తామని స్పష్టం చేశారు. రెండ్రోజుల్లోనే జిల్లా కలెక్టర్లు డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తారన్నారు. ఈ మేరకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడారు. విద్యారంగంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారని మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది విద్యారంగానికి రూ.29,613 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు.

గురుకులాల్లో మనందరం గర్వపడేలా సత్ఫలితాలు వస్తున్నాయని అన్నారు. కొన్ని గురుకులాలను డిగ్రీ కాలేజీ స్థాయికి అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. గురుకులాల్లో 11,714 పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే 5,310 టీచర్ పోస్టులు భర్తీ చేశామని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులను ఇప్పటికే క్రమబద్ధీకరించామని చెప్పారు. అన్ని స్థాయిల విద్యాసంస్థల్లో మరిన్ని పోస్టులను భర్తీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇంటర్, డిగ్రీ స్థాయిల్లో 3,140 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. మిగిలిన ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టామన్నారు.



## చేప మందు పంపిణీ చేసే బత్తిని హరినాథ్ గౌడ్ మృతి

హైదరాబాద్ : చేప మందు పంపిణీ చేసే బత్తిని హరినాథ్ గౌడ్ మృతి చెందారు. హైదరాబాద్‌లోని పాతబస్తీలో నివాసముంటున్న ఆయన తన నివాసంలోనే తుది శ్వాస విడిచారు.

కొంతకాలంగా హరినాథ్ గౌడ్ అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో గత రాత్రి మరణించారు. బత్తిని హరినాథ్ గౌడ్ అనగానే చేప మందు గుర్తుకు వస్తుంది. కొద్ది రోజుల క్రితం అంటే మృగశిర కార్తె సందర్భంగా ఆయన చేపమందు పంపిణీ చేశారు. నేటి సాయంత్రం ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. బత్తిని హరినాథ్ గౌడ్ సోదరులు గత కొన్నేళ్లుగా చేప మందు పంపిణీ చేస్తున్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రతి సంవత్సరం బత్తిని సోదరులు ఇచ్చే చేప మందు కోసం దేశ వ్యాప్తంగా ఆస్తమా రోగులు వేల సంఖ్యలో తరలి వస్తుంటారు. కాగా.. బత్తిని హరినాథ్ గౌడ్ కు భార్య సునిత్రదేవి, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పాత బస్తీ లోని దూద్ బౌలి ప్రాంతానికి చెందిన బత్తిని సోదరులు ఐదుగురు శివరాం, సోమ లింగం, విశ్వనాథ్, హరినాథ్ గౌడ్, ఉమా మహేశ్వర్. 1983 సంవత్సరంలో పాత బస్తీ దూద్ బౌలి నుంచి భోలక్ పూర్ పద్మశాలి కాలనీకి నివాసం మార్చారు.

## పారదర్శకంగా లబ్ధిదారులకు 'డబుల్' ఇళ్లు



హైదరాబాద్: ప్రభుత్వం పారదర్శకంగా లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు అందజేజేస్తుందని.. ఎవరు దళారులను నమ్మొద్దని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం నాడు హైదరాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టితో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, హోంమంత్రి మహమూద్ అలీ, ఎంపీ మనోహర్ రెడ్డి, మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి, జీహెచ్ ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మీడియాతో మాట్లాడుతూ.. "దేశంలో ఎక్కడా లేని విధంగా నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను ముఖ్యమంత్రి కేసీఆర్ ఇస్తున్నారు. పేదవారు సంతోషంగా జీవించాలని సీఎం రూపొందించారు. డబుల్ ఇళ్లకు కు కేంద్ర ప్రభుత్వం 1.5లక్షలు ఇస్తే... రాష్ట్ర ప్రభుత్వం 8లక్షలు రూపాయలు ఇస్తుంది. ప్రతిపక్షాలు 'డబుల్' పై అనవసరపు రాద్ధాంతాం చేస్తున్నారు. వచ్చే నెల 2వ తేదీన హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 500 చొప్పున లబ్ధిదారులకు అందజేస్తాం. 12వేల మంది లబ్ధిదారులకు మొదటగా ఇస్తాం. హైదరాబాద్ సిటీలో ఒక ఇంట్లోనే 10మంది దరఖాస్తు చేసుకున్నారు... అన్ని పరిశీలించిన తర్వాతనే పారదర్శకంగా అందిజేస్తాము. బంజారాహిల్స్, కొకపేట్ లాంటి ప్రాంతాలల్లో కూడా డబుల్ ఇళ్లు కట్టాం. పేదలు కూడా ఇలాంటి ప్రాంతాలల్లో జీవించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం. రానున్న రోజుల్లో నిరంతరంగా ఈ ప్రక్రియ కొనసాగిస్తాం. మా ప్రభుత్వం బడుగు బలహీన, మైనార్టీ వర్గాల కోసం పనిచేస్తోంది" అని మంత్రి తలసాని పేర్కొన్నారు.

**ఎలాంటి అవకతవకలు లేకుండా ఇస్తాం: కలెక్టర్ అనుదీప్** – డబుల్ ఇళ్లలో లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తున్నాం.

15నియోజకవర్గాల్లో లబ్ధిదారులకు లాండం పద్ధతిలో డబుల్ ఇళ్లను అందజేస్తాం. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో ఎలాంటి అవకతవకలు లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి తెలిపారు.

## మాజీమంత్రి కడియం సంచలన వ్యాఖ్యలు.. నా మార్కు ఏంటో చూపిస్తా..



స్టేషన్‌ఘన్‌పూర్(జనగామ): వచ్చే ఐదేళ్లలో ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని రెట్టింపు అభివృద్ధి చేసి తన మార్కు చూపిస్తానని జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. సీఎం కేసీఆర్ ఆయనను బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత మొదటిసారిగా నియోజకవర్గ కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా రాఘవాపూర్, ఛాగల్, గ్రామాల మీదుగా తాటికొండ క్రాస్ రోడ్డు వరకు ర్యాలీగా వచ్చారు. అక్కడ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాపోలు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ఘన్‌పూర్ శివాజీ సర్కిల్ వరకు అశేష జనంతో కడి యం ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభ లో కడియం ప్రసంగించారు. ఘన్‌పూర్ ప్రజల ఆశీర్వాదంతో 14ఏళ్లు మంత్రిగా పని చేశానని గుర్తు చేశారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ తప్పు చేయలేదని, చేసినట్లు ని రూపిస్తే ముక్కు నేలకు రాసి క్షమాపణ అడుగుతానని అన్నారు. పనికిరాని, పసలేని కొన్ని రాజకీయ పార్టీలు కేసీఆర్ పైన, బీఆర్ఎస్ పైన విమర్శలు చేస్తున్నాయని, ప్రజలు, కార్యకర్తలు వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు సీహెచ్ నరేందర్ రెడ్డి, రాపోలు మధుసూదన్, బెలిదె వెంకన్న, దేశినేని హన్మంతరావు, మందపురం ఎల్లాగౌడ్, సూదుల రత్నాకర్ రెడ్డి, భూర్ల శంకర్, అన్నం బ్రహ్మారె డ్డి, రాంబాబు, రజాక్‌యాదవ్, కోతి రాములు, రజాక్‌యాదవ్, నెలమంచ అజయ్ రెడ్డి, తోట వెంకన్నతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంతకీ 'తుమ్మల' నిర్ణయం ఏంటోమరి

### బీఆర్ఎస్‌లో ఉంటారా.. గుడ్ బై చెబుతారా..

ఖమ్మం : ఉమ్మడి జిల్లా కీలక నేత, మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అభ్యర్థిత్వం ఇవ్వకపోవడం పట్ల ఆయన వర్గీయులు అధినాయకత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నుంచి టీఆర్ఎసలో తుమ్మల చేరిక తర్వాత జిల్లాలో టీఆర్ఎస్ బలమైన పార్టీగా మారిందని, మంత్రిగా ఆయన అభివృద్ధిని పరుగులెత్తించిన విషయాన్ని మరిచారని ఆరోపిస్తున్నారు. గత ఎన్నికల్లో అంతర్గత కుట్రల కారణంగానే తుమ్మల ఓడిపోయారని, కానీ నాలుగున్నరేళ్లుగా పార్టీకోసం పనిచేస్తున్న తుమ్మలకు టికెట్ నిరాకరించడమేంటని ప్రశ్నిస్తున్నారు. తుమ్మల ఏ నిర్ణయం తీసుకున్నా ఆయన వెంటే ఉంటామని, స్వంతంత్రంగా అయినా బరిలో ఉండాలని అవసరమైతే కాంగ్రెస్?లో చేరి పాలేరు లేదా ఖమ్మంనుంచి పోటీచేయాలని డిమాండ్ చేస్తున్నారు. బుధవారం సత్తుపల్లి, మధిర, వైరా, ఇల్లెందుతోపాటు పలుచోట్ల తుమ్మల అనుచరులు సమావేశమై భవిష్యత్ కార్యచరణపై చర్చించారు. తుమ్మలకు టికెట్ ఇచ్చే విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పునఃపరిశీలన చేయాలని డిమాండ్ చేశారు.

దీంతో జిల్లా రాజకీయాల్లో వేడి మొదలైంది. తుమ్మల పయనమెటన్న దానిపై చర్చజరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా పలువురు అనుచరులు కొందరు ఆయనకు ఫోన్‌చేసి కాంగ్రెసలో చేరాలని, కొందరు స్వంత్రంగానైనా పోటీ చేయాలని కోరుతున్నారు. ఈ నేపథ్యలో తుమ్మల మాత్రం ఇప్పటి వరకు స్పందించలేదు.

**బుజ్జగించేందుకు నాయకత్వం ప్రయత్నాలు :** తుమ్మల అసంతృప్తిగా ఉన్న విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్.. తుమ్మలను బుజ్జగించేందుకు ఎంపీ నామ నాగేశ్వరరావుతోపాటు మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కరరావును హైదరాబాదులో తుమ్మల ఇంటికి పంపారు. దీంతో ఆ ఇద్దరు నేతలు తుమ్మలతో భేటీ అయి.. గంటకుపైగా చర్చించారు. ఈ క్రమంలో తుమ్మల అసంతృప్తిగానే ఉన్నట్టు సమాచారం. తనకు పార్టీ పాలేరునుంచి పోటీకి అవకాశం ఇస్తుందని నమ్మానని, అదే జరిగితే గోదావరి జలాలను తెచ్చి పాలేరు ప్రజల కాళ్లు కడిగి తానిచ్చిన మాటను నిలబెట్టుకోవాలనుకున్నానని, కానీ పార్టీ తన విషయంలో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం బాధగా ఉందని తుమ్మల పేర్కొన్నట్టు తెలిసింది. ఈ క్రమంలో తుమ్మలను



శాంతింపజేసేందుకు ఆ పార్టీ నాయకులు సీఎం కేసీఆర్‌తో భేటీకి ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలో ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న తుమ్మల శుక్రవారం ఖమ్మం వస్తున్నారని, ఆయనకు నాయకన్ గూడెం వద్ద ఘన స్వాగతం పలికి ఖమ్మంవరకు భారీ ప్రదర్శన నిర్వహించాలని తుమ్మల వర్గీయులు నిర్ణయించారు.

**బీఆర్ఎస్‌లో గుబులు రేపుతున్న తుమ్మల అసంతృప్తి :** తుమ్మల, ఆయన వర్గం అసంతృప్తితో ఉన్న విషయం బీఆర్ఎస్ నేతల్లో గుబులు రేపుతోంది. తుమ్మల స్వతంత్రంగా పోటీచేసినా, కాంగ్రెస్ నుంచి బరిలో దిగినా బీఆర్ఎస్ ఓటుబ్యాంకుకు బీటలు వారే అవకాశం ఉంది. తుమ్మల టీడీపీనుంచి టీఆర్ఎస్?లో చేరిన తర్వాత టీడీపీ కేడర్ బీఆర్ఎసకు రావడంతో 2014లోనామమాత్రంఆ ఉన్న టీఆర్ఎస్ 2019నాటికి బలమైన పార్టీగా అవతరించింది. పార్టీలో విబేధాల కారణంగా సీట్లు కోల్పోయినా గెలుపుదగ్గరగా గత ఎన్నికల్లో అబ్యర్థులు రావడం చెప్పుకోదగిన విషయం. తుమ్మల పార్టీని వీడితే బీఆర్ఎస్ ఓటుబ్యాంకుకు గండిపడుతుందని, ఈపరిస్థితుల నేపథ్యంలో తుమ్మలకు సముచిత గౌరవం కలిపించి, ఆయన్ను పార్టీలోనే కొనసాగించేందుకు టీఆర్ఎస్‌లోని ప్రజాప్రతినిధులు కొందరు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. శుక్రవారం జరిగే ర్యాలీ, భేటీ అనంతరం తుమ్మల భవిష్యత్ కార్యచరణపై ప్రకటించే అవకాశం కనిపిస్తోంది.

## 119 మంది అడిగితే.. 119 చోట్లా పోటీ చేస్తారా?



హైదరాబాద్ : బీజేపీ, బీఆర్ఎస్ వేర్వేరు కాదని.. కొట్లాడితే ఈ రెండు పార్టీలపై కొట్లాడాలని తెలంగాణ జనసమితి చీఫ్ కోదండరాం అన్నారు. దోపిడీ రాజ్యం పోయి సామాజిక తెలంగాణ రావాలన్నారు. భయంతోనే కేసీఆర్ రెండు చోట్ల పోటీ చేస్తున్నాడని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే కేసీఆర్ రెండవ నియోజకవర్గం వెళ్ళాలని అనుకుంటున్నాడన్నారు. కేసీఆర్‌పై ఉమ్మడి అభ్యర్థిని దింపితే బాగుంటుందని గద్దర్ ఆలోచన చేశారన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేయమని ఆ నియోజకవర్గ ప్రజలు అడిగినందుకు రెండో చోట్ల పోటీ చేస్తున్నానని కేసీఆర్ చెబుతున్నారన్నారు. 119 మంది అడిగితే 119 స్థానాల్లో చేస్తారా? అని కోదండరాం ప్రశ్నించారు. తాను ఎక్కడ పోటీ చేయాలో తమ పార్టీ నిర్ణయిస్తుందని తెలిపారు. పొత్తుల విషయం కాంగ్రెస్ త్వరగా తేలిస్తే బెటర్ అన్నారు. లెఫ్ట్ పార్టీలకు కేసీఆర్‌పై ఉన్న భ్రమలు తొలిగిపోయాయని.. ఇది మంచి పరిణామమని కోదండరాం అన్నారు.

## అవహేళనలు ఆపి.. మహిళా బిల్లు ఆమోదానికి కృషి చేయండి.. బీజేపీకి ఎమ్మెల్సీ కవిత హితవు

హైదరాబాద్: మహిళలపై దాడి చేయడం ఆపాలని బీజేపీకి ఎమ్మెల్సీ కవిత సూచించారు. మహిళల గురించి తప్పుడు వ్యాఖ్యానాలతో అవహేళన చేయడం మానుకోవాలని స్పష్టం చేశారు. వ్యక్తిత్వహరణం చేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని మండిపడ్డారు. సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్)లో తెలంగాణ బీజేపీ చేసిన ఓ ట్వీట్‌పై కవిత ఘాటుగా స్పందించారు.

కాలంచెల్లిన మూస పద్ధతిలో మహిళలను అవహేళన చేయడం తగదని స్పష్టం చేశారు. మహిళలు ఉన్నత స్థానానికి చేరుకోవడం బీజేపీ ఓర్వలేక పోతున్నదా అని ప్రశ్నించారు.

మహిళల హక్కుల గురించి మాట్లాడుతున్న వారి గొంతు నొక్కడానికి కాషాయ పార్టీ చేస్తున్న ప్రయత్నాలు హాస్యాస్పదంగా ఉన్నాయని స్పష్టంచేశారు. ఇప్పటికైనా ఇతరులపై నిందలు వేయడం మానుకొని పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.



## మియాపూర్ ఘటన.. ఉద్యోగం పోగొట్టాడనే కక్షతోనే కాల్పులు!



హైదరాబాద్: మియాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ హోటల్ జనరల్ మేనేజర్‌పై జరిగిన కాల్పుల ఘటన కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని కేరళకు చెందిన రితీష్ నాయర్‌గా గుర్తించి అదుపులోకికి తీసుకున్నారు. మదీనాగూడలోని సందర్శిని హోటల్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న దేవేందర్ గాయన్ (35)పై బుధవారం అర్ధరాత్రి కాల్పులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన దేవేందర్.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన మియాపూర్ పోలీసులు.. నిందితుడిని గుర్తించారు. రితీష్ నాయర్, దేవేందర్ గతంలో ఒకేచోట మేనేజర్లుగా పనిచేశారు. నెలరోజుల క్రితం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో దేవేందర్‌పై రితీష్ చేయిచేసుకున్నాడు.

ఇదే విషయాన్ని హోటల్ యాజమాన్యానికి దేవేందర్ ఫిర్యాదు చేశారు. దీంతో రితీష్‌ను యాజమాన్యం తొలగించింది. దేవేందర్ వల్లే ఉద్యోగం పోయిందంటూ అతడిపై రితీష్ కక్ష పెంచుకున్నాడు. దేవేందర్ బుధవారం రాత్రి విధులు ముగించుకుని వెళ్లే సమయంలో రెక్కీ నిర్వహించాడు. అనంతరం హెల్మెట్ ధరించి తన వెంట తెచ్చుకున్న దేశవాలీ తుపాకీతో అతడిపై ఐదురౌండ్ల కాల్పులు జరిపాడు. ఈ ఘటనపై మాదాపూర్ డీసీపీ సందీప్ మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలను వెల్లడించనున్నారు.

## అన్యాయం జరిగింది కాబట్టే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశా



నల్గొండ : తాజాగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. తమకు టికెట్ రాకపోవడంతో కొందరు ఆశావహులు పార్టీని వీడుతున్నారు. వారిలో మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం ఒకరు. తనకు అన్యాయం జరిగింది కాబట్టే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశానని వేముల వీరేశం అన్నారు. నేడు ఆయన మాట్లాడుతూ.. నకిరేకల్ ఎమ్మెల్యే అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. కూల్చివేతలు తప్ప తమ నియోజకవర్గంలో ప్రత్యేకంగా చేసిందేమి లేదన్నారు. తన హాయంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. కార్యకర్తల అభీష్టం మేరకే నిర్ణయం తీసుకుంటానని తెలిపారు.

ఇండిపెండెంట్‌గా పోటీ చేసినా, ఏ పార్టీలోకి వెళ్లినా నకిరేకల్‌లో గెలిచేది తానేనని వేముల వీరేశం స్పష్టం చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com